PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 324 | విజయవాడ, ఆదివారం 25 జూన్ 2023 | 6 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 25 June 2023 | Rs

ప్రజాస్వామ్య సూచీలో అట్టడుగున భారత్

- మార్పు చేయించేందుకు కేంద్రం రహస్య యత్నాలు

5



నర్సింగపేటలో మహా పాదయాత్ర బృందానికి హారతులతో స్వాగతం చెబుతున్న మహిళలు

ఆస్తి పన్ను ఏటా 20% పెంచాలి

మున్సిపల్ బాండ్లు, యూజర్ ఛార్జీలు

స్పెషల్ అసిస్టెన్స్ పేరిట కేంద్రం తాజా షరతులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం ఇచ్చే కొద్దిపాటి రుణాలకు తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి ఆస్తి పన్నును పెంచుతూ.. చెత్త పన్నును ప్రజల నుంచి గుంజుతోంది. ఆస్తి పన్నును ప్రతియేటా 20 శాతం పెంచాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా రాష్ట్రాలకు జారీ చేసిన మార్గదర్శకాల్లో పేర్కొంది. స్థానిక ప్రజలపై పన్ను భారం వేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేస్తోంది. పట్టణ స్థానిక సంస్థలకు తాజాగా ప్రత్యేక సాయం పథకాన్ని నాలుగో దఫాగా ఈ ఏడాదికి కేంద్రం ప్రవేశపెట్టింది. కొన్ని రాష్ట్రాలకు రూ.150 కోట్లు చొప్పున, మరికొన్ని రాష్ట్రాలకు రూ.100 కోట్లు చొప్పున, ఇంకొన్ని చిన్న రాష్ట్రాలకు రూ.50 కోట్లు చొప్పున ఇవ్వనుంది. ఈ సొమ్ము వడ్డీ లేని దీర్ఘకాలిక రుణమే తప్ప గ్రాంటు కాదు.

పట్టణ స్థానిక సంస్థల్లో ఆర్థిక సంస్కరణల పేరిట ఈ రుణం విడుదల చేస్తున్నట్లు చెబుతూ అందుకుగానూ మార్గదర్శకాలను కూడా విడుదల చేసింది. ఇందులో ప్రధానంగా ఆస్తి పన్నును ఎలా పెంచాలన్నదానిపైనే కేంద్రం షరతుల వంటి సూచనలు చేసింది. పట్టణ స్థానిక సంస్థలు తమ రుణ యోగ్యతా సర్టిఫికెట్ల పరిస్థితిని మెరుగుపరుచుకోవడం, తద్వారా మున్సిపల్ బాండ్లను ప్రకటిస్తూ ఆస్తి పన్ను చెల్లింపులను మరింతగా ప్రోత్సహించేలా చూడడంపైనే ఈ సూచనలు ఉండడం గమనార్హం. దీనికోసం అన్ని రాష్ట్రాలూ ప్రత్యేకంగా రోడ్ మ్యాప్ తయారుచేసుకోవాలని సూచించింది. ప్రత్యేకంగా ఐదు లక్షల మందికన్నా ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. ఆస్తి పన్ను కోసం డిజిటల్ ప్రాపర్టీ ట్యాక్స్ రిజిస్టర్‌ను ఏర్పాటుచేయాలని కేంద్రం సూచించింది. దీనికి కూడా డ్రోన్ బేస్డ్ టెక్నాలజీతో అమలు చేయాలని పేర్కొంది. ఈ రిజిస్టర్‌ను స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్, రెవెన్యూశాఖల రికార్డులను అనుసంధానం చేయాలని సూచించింది.



ఏటా 20 శాతం పెంపు లక్ష్యం

ఆస్తి పన్ను వసూళ్లు ప్రతియేటా పెరగాలని మార్గదర్శకాల్లో కేంద్రం పేర్కొంది. కనీసం ఏటా 20 శాతం పెంపు ఉండేలా చూసుకోవాలని పేర్కొనడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది జనవరి 15 వరకు పన్ను వసూళ్లు పటిష్టంగా అమలు చేయాలని, అవసరమైతే ఆస్తి పన్నును పెంచాలని కూడా సూచించింది. ఈ మార్గదర్శకాలను అమృత్ నగరాల్లో 10 శాతం అమలు జరిగేలా చూడాలని, అలా చేస్తే ఆయా రాష్ట్రాలకు మరో రూ.50 కోట్లు చొప్పున సాయం పెంచనున్నట్లు కేంద్రం పేర్కొంది.

యూజర్ ఛార్జీలు పెంపు

పట్టణాలు, నగరాల్లో పలు యూజర్ ఛార్జీలు పెంచుకోవచ్చని కేంద్రం సూచనలు చేయడం గమనార్హం. ప్రధానంగా నీటి, పారిశుధ్య ఛార్జీలను పెంచడం, సేవా ఛార్జీల్లో ఆపరేషన్, మెయింటెనెన్స్ ఛార్జీలు పెంచడంపైనా దృష్టి సారించాలని ఈ మార్గదర్శకాల్లో చేసిన సూచనలు రాష్ట్ర ప్రజలపై భారం పడేవిగానే ఉన్నాయి. ఇలా వచ్చిన ఆదాయాన్ని ఎస్క్రో ఖాతాల ద్వారా నిల్వ ఉంచాలని సూచించింది. ఈ ఆదాయంతోనే ఆయా మున్సిపాల్టీలు భవిష్యత్తులో చేసే అప్పులను తీర్చుకోవాలని పేర్కొంది.

ఔను.. చట్ట ఉల్లంఘనే!

- హిందీని రుద్దడంపై కేంద్రం ఒప్పుకోలు

న్యూఢిల్లీ : దేశంలో ఉన్నత విద్యా సంస్థల్లో హిందీని బలవంతంగా రుద్దేందుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలోని పార్లమెంటరీ కమిటీ చేసిన సిఫార్సు చట్టాన్ని ఉల్లంఘించడమేనని కేంద్రం ఎట్టకేలకు అంగీకరించింది. తన పరిధిలో లేని అంశంపై కమిటీ చేసిన సిఫార్సు అధికార భాషా చట్టానికి విరుద్ధమన్న మాట నిజమేనని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆలస్యంగా ఇచ్చిన సమాధానంలో పేర్కొంది. ఐఐటిలు, ఐఐఎంలు, ఎయిమ్స్, కేంద్ర విశ్వవిద్యాలయాలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయా వంటి సంస్థల్లో ప్రధాన భాషగా ఇంగ్లీషు స్థానంలో హిందీని ప్రవేశపెట్టాలని అమిత్ షా కమిటీ సిఫార్సు చేసింది. ఈ సిఫార్సు గత ఎనిమిది మాసాలుగా రాష్ట్రపతి పరిశీలనలో వుంది. గత ఏడాది డిసెంబరులో సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ రాజ్యసభలో ఈ అంశాన్ని లేవనెత్తుతూ ఉన్నత విద్యలో హిందీని తప్పనిసరి చేస్తూ అమిత్ షా కమిటీ చేసిన చట్టాన్ని ఉల్లంఘించడమా? కాదా? అని ప్రశ్నించారు. దీనిపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన సమాధానం రాకపోవడంతో బ్రిట్టాస్ సభాధ్యక్షులైన ఉప రాష్ట్రపతికి ఫిర్యాదు చేశారు. చివరికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దీనికి సమాధానం ఇచ్చింది. ఆ సిఫార్సు చట్టాన్ని ఉల్లంఘించడమేనని పేర్కొంది. హిందీని అధికార భాషగా ఉపయోగించడానికి సంబంధించి నెలకొన్న పురోగతిని అంచనా వేసి, రాష్ట్రపతికి నివేదిక అందజేయడమే కమిటీ బాధ్యత. అంతకుమించి మరే ఇతర జోక్యానికి అనుమతి లేదా అధికారమివ్వలేదు. అయితే, సమాధానంలో దీన్ని ప్రస్తావించకుండా చట్టాన్ని ఉటంకించారు. హిందీతో పాటు ఇంగ్లీషును కూడా అధికార కార్యాచరణకు ఉపయోగించాలని అధికార భాషా చట్టం పేర్కొంటోంది. పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభలు చట్టాన్ని ఆమోదించే వరకు షరతులకు కట్టుబడి వుండేందుకు కేంద్ర హోం శాఖ అంగీకరించింది. పార్లమెంటరీ కమిటీ సిఫార్సుల నివేదిక బుట్టదాఖలు చేసే అవకాశం ఉండటంతోనే కేంద్రం ఇంకా దీన్ని బహిరంగపరచలేదని పరిశీలకులు భావిస్తున్నారు.

మండలం యూనిట్‌గా ఆర్‌ఆర్

2013 భూ సేకరణ చట్ట ప్రకారం పునరావాసం, పరిహారం : వి శ్రీనివాసరావు డిమాండ్

పోలవరం పోరుకేకకు అడుగడుగునా నీరాజనం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి, చింతూరు

పోలవరం నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పునరావాసం, పరిహారం చెల్లించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్రకు విలీన మండలాలలో అపూర్వ స్పందన లభిస్తోంది. ఈ యాత్ర శనివారానికి ఐదో రోజుకు చేరుకున్న సందర్భంగా చింతూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గడిచిన నాలుగు రోజులుగా 40 గ్రామాల్లో పర్యటించామని, పార్టీలకతీతంగా నిర్వాసితులు గ్రామగ్రామానా ఘనస్వాగతం పలికి ముంపుపై తమ ఆందోళనను వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పది సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రాబట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. భద్రాచలం వద్ద 37 మీటర్ల ఎత్తుకు వరద వచ్చే సరికే 109 గ్రామాలు పూర్తిగా ముంపునకు గురయ్యాయని, పోలవరం వద్ద 41 మీటర్లు నీరు నిలబెడితే నాలుగు మండలాల్లో 324 గ్రామాలు ముంపు బారిన పడతాయని తెలిపారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు చెల్లింపు, పునరావాసం, ఎకరా భూమికి రూ.5 లక్షలు ఇస్తామని ఇచ్చిన హామీని విస్మరించి కొందరికే ఇళ్లు నిర్మించి ఇస్తాం, మరి కొందరికి రూ.2.75 లక్షలు, ఇంకొందరికి రూ.3.75 లక్షలు ఇస్తామనడం శోచనీయమన్నారు. ఈ ప్రాంతంలో అన్ని గ్రామాలూ ముంపునకు గురవుతున్నాయని, మండలాన్ని యూనిట్‌గా తీసుకుని 2013 చట్టం ప్రకారం పునరావాసం, పరిహారం చెల్లించాల్సిందేనని అన్నారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టలేకపోతే రాష్ట్ర ప్రభుత్వమే ఇవ్వాలని, కేంద్రం ఇవ్వడం లేదంటూ నిస్సహాయత వ్యక్తం చేస్తే అది అసమర్థతేనని పేర్కొన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ముఖ్యమంత్రి వ్యక్తిత్వానికే కళంకం అని అన్నారు. ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు, సర్వస్వం త్యాగం చేసిన నిర్వాసితులకు కోత పెట్టి కమీషన్ల కక్కుర్తితో ఎస్టిమేషన్లు పెంచుతూ కాంట్రాక్టర్ల జేబులు నింపుతారా? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్రంలోని బిజెపికి భజన పార్టీలలా మారాయని శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం నిర్వాసితుల కోసం తాము పోరాటం చేస్తున్నామని, ఈ తరుణంలో ప్రజల కోసం పోరాడతారా? లొంగిపోతారా? అనేది తేల్చుకోవాలని సవాలు విసిరారు. రాష్ట్రంలో ప్రజాదరణలేని బిజెపి ఈ మూడు పార్టీలనూ అడ్డంపెట్టుకుని నాటకాలాడుతోందని మండిపడ్డారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ తన వారాహి పర్యటనలో కేంద్రం చేసిన మోసంపై ఎందుకు ప్రశ్నించడం లేదని అన్నారు. విజయనగరం జిల్లాలో గిరిజన యూనివర్సిటీ దయనీయ పరిస్థితిని వివరించారు. తునికాకు కార్మికులు తొమ్మిది సంవత్సరాలుగా బోనస్ కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. శ్రీవాణి ట్రస్టును అడ్డం పెట్టుకుని విహెచ్‌పి, ఆర్‌ఎస్‌ఎస్ వంటి సంస్థలు మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నాయని, సమరసత ఫౌండేషన్‌లకు వందల కోట్ల రూపాయలు కేటాయించి రాష్ట్రాన్ని మత ఘర్షణల కుంపటిగా మార్చుతున్నాయని విమర్శించారు. తక్షణమే ఆ నిధులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రియల్ ఎస్టేట్ మాఫియాకు కేంద్రంగా మిగతా 5లో

'పోరుకేక' @ 100 కిలోమీటర్లు 3



'ఫెర్రో' పరిశ్రమలకు విద్యుదాఘాతం

- గుదిబండగా డిమాండ్ ఛార్జీలు
- జులై ఒకటి నుంచి మూసివేత!
- నష్టాలతో నడపలేమంటున్న యాజమాన్యాలు
- రోడ్డున పడనున్న 50 వేల కార్మిక కుటుంబాలు

3

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా

సచివాలయాలు

- సర్వే పూర్తయిన గ్రామాల్లో మాత్రమే అమలు
- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

భూముల రీసర్వే పూర్తయి, రెవెన్యూ రికార్డులు నూరు శాతం తయారైన 2 వేల గ్రామాలు, వార్డుల్లోని ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ల నమోదు ప్రక్రియ ఇక సులభతరం కానుంది. ఇప్పటి వరకు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ కార్యాలయాలు (ఆర్ఒ) లేక సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో మాత్రమే క్రయ, విక్రయాలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతుండేది.



ఈ నేపథ్యంలో గ్రామాల్లోనే పౌరసేవలు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు వీలు కల్పిస్తూ ప్రభుత్వం శనివారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇకపై ఆయా గ్రామాల్లోని గ్రామ, వార్డు సచివాలయాలు సబ్ రిజిస్ట్రార్, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా సేవలందించనున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ తక్షణమే అమల్లోకి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ యాక్ట్ 1908 (1908 యాక్ట్ నెంబరు 16)లోని సెక్షన్ 7 సబ్ సెక్షన్(1) కింద అందించబడిన అధికారాలను అమలు చేయడంలో ఇతర నోటిఫికేషన్‌లను పాక్షికంగా సవరించినట్లు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. ఇందు కోసం పంచాయతీరాజ్ కమిషనరు, గ్రామ, వార్డు సచివాలయాలశాఖ డైరెక్టరు, రెవెన్యూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ కమిషనరుతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని తెలిపింది.

బీరేన్‌సింగ్ సిఎంగా అనర్హుడు

- బాధితులకు పునరావాసం, ప్యాకేజీ
- అఖిలపక్షంలో వివిధ పార్టీల డిమాండ్
- ప్రధాని మోడీ గైర్హాజరుపై నిలదీత
- మణిపూర్‌లో పరిస్థితి అదుపులో లేదు : అమిత్ షా



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మణిపూర్ హింసను నిలువరించడంలో విఫలమైన ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని వివిధ రాజకీయ పార్టీలు స్పష్టం చేశాయి. అక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు అఖిలపక్షాన్ని పంపాలని డిమాండ్ చేశాయి. మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ మౌనం దాల్చడాన్ని తీవ్రంగా విమర్శించాయి. శనివారం నాడిక్కడ పార్లమెంట్ లైబ్రరీ బిల్డింగ్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన మణిపూర్ పరిస్థితులపై అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ప్రధాని హాజరుకాకపోవడంపై ప్రతిపక్ష పార్టీలు నిలదీశాయి. మణిపూర్‌లో పరిస్థితి అదుపులో లేదని అమిత్ షా తొలిసారి బహిరంగంగా అంగీకరించారు. తనను విశ్వసించాలని, ఈ విషయంపై ప్రధాని సూచనలు ఇస్తున్నారని అమిత్ షా పేర్కొన్నారు. ఈ ఘర్షణల్లో ఇప్పటి వరకు 131 మంది మరణించారని, హింస, దోపిడీ సహా 5,036 ఘటనలు నమోదయ్యాయని తెలిపారు. 5,889 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, 144 మందిని అరెస్టు చేశారు. వివాదాలకు కారణమైన కేసును హైకోర్టు నుంచి సుప్రీం కోర్టుకు బదిలీ చేసేలా చర్యలు తీసుకోవచ్చని అమిత్ షా అన్నారు.

ప్రధాని ఒక్కసారి కూడా మణిపూర్ వైపు చూడలేదు : ఓక్రమ్ ఇబోబీ సింగ్

మణిపూర్ భారత్‌లో భాగమని, ప్రధాని ఒక్కసారి కూడా ఆ రాష్ట్రం వైపు చూడలేదని కాంగ్రెస్ నేత, మణిపూర్ మాజీ ముఖ్యమంత్రి ఓక్రమ్ ఇబోబీ సింగ్ విమర్శించారు. గత 50 రోజులుగా ఒక్క మాట కూడా మాట్లాడని ప్రధాని మోడీ నేతృత్వంలో మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తే బాగుండేదని అన్నారు. కేంద్ర సాయుధ బలగాలను వెంటనే వెనక్కి పంపాలన్నారు. పరిస్థితిని చక్కదిద్దడంలో, సంక్షోభాన్ని నిలువరించడంలో సిఎం ఘోరంగా విఫలమయ్యారని, ఆ విషయాన్ని స్వయంగా రెండుసార్లు బీరేన్‌సింగ్ బహిరంగంగా అంగీకరించారని, ప్రజలను క్షమించాలని కూడా కోరారని చెప్పారు. కుకీ ప్రయోజనాలను సమర్థిస్తున్నామని చెప్పుకునే కొన్ని మిలిటెంట్ గ్రూపులతో త్రైపాక్షిక ఒప్పందాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చి 11న ఏకపక్షంగా ఉపసంహరించుకుందని తెలిపారు. ఈ చర్యను తరువాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తిరస్కరించిందన్నారు. కానీ, అప్పటికే జరగాల్సిన నష్టం మిగతా 5లో



రష్యాలోని రోస్తో అన్ డాన్ నగరంలో ప్రైవేట్ మిలిటరీ కంపెనీ వాగ్నర్ గ్రూపు యుద్ధ ట్యాంక్‌తో స్వైర విహారం చేస్తున్న దృశ్యం

రష్యాలో వాగ్నర్ గ్రూపు విద్రోహం

- సాయుధ తిరుగుబాటుకు యత్నం
- సోషల్ మీడియాలో క్లిప్పింగ్స్ వైరల్
- కుట్రలను ఐక్యంగా తిప్పికొడదాం: పుతిన్
- బాసటగా చెచెన్యా, కజకిస్తాన్, బెలారస్ తదితర దేశాలు

మాస్కో: రష్యా దక్షిణ ప్రాంత నగరమైన రొస్తోవ్ అన్ డాన్‌లో యెవెగిన్ ప్రిగోజిన్ నాయకత్వంలోని వాగ్నర్ ప్రైవేట్ మిలిటరీ గ్రూపు శుక్రవారం సాయుధ తిరుగుబాటుకు యత్నించింది. తమ స్థావరాలపై రష్యన్ ఆర్మీ రాకెట్ దాడులు చేసిందని, దీనికి ప్రతిగా తాము సాయుధ తిరుగుబాటుకు పాల్పడినట్లు వాగ్నర్ గ్రూపు బాస్ ప్రిగోజిన్ తన టెలిగ్రామ్ చానెల్‌లో పోస్ట్ చేసిన వీడియోలో పేర్కొన్నాడు. రష్యన్ రక్షణ మంత్రిత్వ శాఖ ఈ ఆరోపణలను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. రొస్తోవ్ అన్ డాన్ ప్రాంతంలో యూనిఫాం దుస్తులు ధరించిన సైనికులు గస్తీ తిరుగుతుండడం, ఇంధన ట్యాంకు దగ్ధం వంటి దృశ్యాలకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. యూనిఫాంలో ఉన్న సైనికులు ప్రైవేట్ మిలిటరీ కంపెనీ (పిఎంసి) వాగ్నర్ కు చెందినవారా? లేక రష్యన్ ఫెడరేషన్ ఆర్మీకి చెందినవారా అనేది మిగతా 5లో

హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెగని వర్షాలు..

- స్తంభించిన రాకపోకలు

సిమ్లా : ఉత్తరాది రాష్ట్రమైన హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెగని వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు మూడు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తుండటంతో ఆ రాష్ట్రం పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. పలుచోట్ల రహదారులపై కొండచరియలు విరిగిపడ్డాయి. మరికొన్నిచోట్ల వరదలు పోటెత్తి రహదారులు కొట్టుకుపోయాయి. ఇంకొన్ని చోట్ల రోడ్లు పూర్తిగా నీట మునిగాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 5వ నంబర్ జాతీయ రహదారి సహా 20 రోడ్లలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మండి జిల్లాలోని కటౌలాలో అత్యధికంగా 163.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తర్వాత వరుసగా సిన్‌హుటాలో 160 మిల్లీమీటర్లు, కసౌలీలో 145 మిల్లీమీటర్లు, కంగ్రాలో 143.5 మిల్లీమీటర్లు, హిమాచల్ రాజధాని షిమ్లాలో 99.2 మిల్లీమీటర్ల వర్షం పడింది. మరో రెండు రోజులు కూడా హిమాచల్‌లో భారీ వర్షాలు పడతాయని షిమ్లాలోని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇవాళ రేపు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. ఈ మేరకు ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది.

ఎంపి కుటుంబం కిడ్నాప్‌పై

హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ

- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ కుటుంబం, ఆడిటర్ జివి ఇటీవల కిడ్నాప్ అయిన ఉదంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. 'ప్రశాంతతకు నిలయం విశాఖపట్నం. ఆంధ్ర రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక రాజధానిగా ఈ నగరం ఉంది. పారిశ్రామిక అభివృద్ధికి విశాఖలో ఈ కాలంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సమ్మిట్‌లు నిర్వహించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నట్లు, సెప్టెంబర్ నుంచి విశాఖకు మకాం మారుస్తున్నట్లు ప్రకటించారు. అయితే, ఈ కాలంలో విశాఖలో జరుగుతున్న పరిణామాలు ప్రజలను తీవ్ర అశాంతికి గురిచేస్తున్నాయి' అని ఈ లేఖలో పేర్కొన్నారు. ఆ వివరాలను మీడియాకు శనివారం వారు విడుదల చేశారు. 'ఇటీవల విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ భార్య జ్యోతి, కుమారుడు శరత్ చౌదరి, ఆడిటర్ గన్నంనేని వెంకటేశ్వరరావు (జివి)ల కిడ్నాప్ విశాఖ ప్రజలను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఎంపి కుటుంబానికి రక్షణ లేకపోతే, సాధారణ ప్రజల భద్రతకు భరోసా ఏదీ అనే ప్రశ్న అందరి మెదళ్లను తొలిచివేస్తోంది. దీనికి తోడు సదరు ఎంపి చేస్తున్న రోజుకొక ప్రకటన పలు అనుమానాలకు తావిస్తున్నాయి. ఎంపి కుటుంబ సభ్యులు మూడు రోజులు, ఆడిటర్ జివి ఒక రోజు కిడ్నాప్‌కు గురైనప్పటికీ నిఘా వ్యవస్థ ఎందుకు పసిగట్టలేకపోయింది? 50 గంటల పాటు వీరిని చిత్రహింసలు పెట్టినా రహస్యంగా ఉంచాల్సిన అవసరం ఎందుకొచ్చింది. కిడ్నాప్‌కు గురైన వారు కొన్ని గంటల్లోనే రూ.1.70 కోట్లు ఒకేసారి రౌడీషీటర్‌కు ఎలా సమకూర్చారు? ఇంత పెద్ద మొత్తం ఎవరెవ్వరి దగ్గర నుంచి సమకూర్చారు? హైదరాబాద్‌లో వ్యాపారాలు, విశాఖలో రాజకీయాలు చేస్తానని ఎంపి ప్రకటించారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ఎంపిపై లేదా? ఎన్నుకున్న విశాఖ ప్రజలకు ఎంపి ఏ సందేశం ఇవ్వదలిచారు. రౌడీ షీటర్‌కూ, ఎంపికీ మధ్య భూ లావాదేవీలు ఉన్నట్లు ప్రజలు భావిస్తున్నారు. ఎంపి కూడా రూ.5 కోట్లు రౌడీ షీటర్‌కు ఇవ్వాలని, అందుకే ఈ ఘటన జరిగిందని చర్చ నడుస్తోంది. ఈ వ్యవహారంలో సుబ్బలక్ష్మి అనే మహిళ పాత్ర ఉన్నట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. ఎంపిగా ఎంవివి.సత్యనారాయణ గెలిచిన తరువాత విశాఖలో తమ వ్యాపార సామ్రాజ్యాన్ని మిగతా 5లో



తిరుమలలో చిక్కిన చిరుత

3

స్పార్క్ ర్యాంకింగ్స్‌లో మెప్మా టాప్

- పురస్కారాన్ని స్వీకరించిన విజయలక్ష్మి
- సంక్షేమ పథకాల అమలులో ప్రతిభ

2

9లోగా గ్రేడ్‌-2 విఆర్‌ఒల ప్రొబేషన్‌ డిక్లేర్‌

- విఆర్‌ఒల సంఘం డిమాండ్‌

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రేడ్‌-2 విఆర్‌ఒల ప్రొబేషన్‌ డిక్లేర్‌, సర్వే సప్లిమెంటరీ ఎగ్జామ్స్‌ విషయంలో ప్రభుత్వం ఒక నిర్ణయం తీసుకోవాలని, లేని పక్షంలో జులై 9న చర్చించి రాష్ట్ర వ్యాప్త ఉద్యమంపై నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర విఆర్‌ఒల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనంతపురం జిల్లాలో గ్రేడ్‌-2 విఆర్‌ఒల ప్రొబేషన్‌ డిక్లేర్‌ ఇప్పటికీ చేయకపోవడం ఆ జిల్లా అధికారుల పనితీరుకు నిదర్శనమని పేర్కొన్నారు. విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్‌ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్‌ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
**స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్‌ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501**కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

తిరుమల ఘాట్‌లో రెండు ప్రమాదాలు

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల మొదటి ఘాట్‌ రోడ్‌ వినాయక గుడి వద్ద రెండు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఒకదాని తర్వాత ఒకటి అదుపు తప్పి పక్కనున్న కల్వర్టును రెండు కార్లు ఢీ కొన్నాయి. మొదట జరిగిన ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో కాసేపు వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్‌ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్‌ చేశారు. ప్రమాదం ఎలా జరిగిందన్న అంశంపై పోలీసులు ఆరా తీశారు. ఆ తర్వాత మరో ప్రమాదంలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి.

రెండు ఆర్‌టిసి బస్సులు ఢీ

- 10 మందికి గాయాలు

ప్రజాశక్తి- తాళ్లరేవు(కాకినాడ జిల్లా)

కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం కోరంగి పాత అయ్యప్ప స్వామి గుడి సమీపంలోని 216 జాతీయ రహదారిపై రెండు ఆర్‌టిసి బస్సులు శనివారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న పదిమంది ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు, కోరంగి పోలీసుల సహకారంతో తాళ్లరేవు సిహెచ్‌సికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం వారిని వైద్యులు ఇంటికి పంపించారు. ఈ ఘటనలో అమలాపురం, కాకినాడ డిపోలకు చెందిన రెండు ఆర్‌టిసి బస్సులు స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఘటనా ప్రాంతాన్ని కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాస్‌కుమార్‌ పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగ ఓట్లపై సమగ్ర విచారణ

- సిపిఐ డిమాండ్‌

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో దొంగ ఓట్ల చేర్పింపుపై సమగ్ర విచారణ జరపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ డిమాండ్‌ చేశారు. ఒకే డోర్‌ నెంబర్‌తో 510 ఓట్లు చేర్చుకున్నారంటే ఎన్నికల కమిషన్‌ ఏం చేస్తుందో అర్థం కావడం లేదని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. దొంగ ఓట్లు చేర్పింపు అంశాన్ని ఎన్నికల కమిషన్‌ సీరియస్‌గా పరిగణించాలని, కారకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌ చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో దొంగ ఓట్లు చేర్పింపు జరిగిందని విమర్శించారు. వలంటీర్లను ఉపయోగించుకుని అధికార వైసిపి పూర్తిగా అక్రమాలకు పాల్పడుతోందన్నారు. ఓటరు జాబితాలో ఎవరి పేర్లు ఉండాలో నిర్ణయించే దుస్థితి దాపురించిందని, ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నా ఎన్నికల కమిషన్‌ చోద్యం చూస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి అధికారం చేపట్టాక భూముల ధరలు తగ్గాయన్నారు. అభివృద్ధిలో తెలంగాణతో పోల్చితే రాష్ట్రం వెనుకబడిందన్నారు. రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ ఈ అంశంపై చర్చకు సిద్ధమా? అని సవాల్‌ చేశారు.

రాష్ట్రంలో రాజకీయ శూన్యత

- సోము వీర్రాజు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రాజకీయ శూన్యత ఏర్పడిందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మోడీ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రానికి చేసిన మేలు గురించి ప్రజలకు వివరించేందుకు కేంద్ర మంత్రులు, బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి నడ్డా కూడా రాష్ట్రంలో పర్యటించారన్నారు. జల్‌జీవన్‌ మిషన్‌ అని చెప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని ప్రచారం చేసుకోవడంపై కేంద్ర మంత్రులు నిలదీశారన్నారు. కేంద్రం ఏమి చేసిందో తాము సభలు పెట్టి చెబుతున్నామని, రాష్ట్ర ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేసిందో చెప్పాలని డిమాండ్‌ చేశారు.

స్పార్క్‌ ర్యాంకింగ్స్‌లో మెప్మా టాప్‌

- పురస్కారాన్ని స్వీకరించిన విజయలక్ష్మి
- సంక్షేమ పథకాల అమలులో ప్రతిభ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణ పేదరిక నిర్మూలన, పేదల సంక్షేమం కోసం మెప్మా తీసుకుంటున్న చర్యలకు జాతీయస్థాయి గుర్తింపు లభించింది. కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ ఆధ్వర్యాన జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్‌ రూపొందించిన సిస్టమాటిక్‌ ప్రొగ్రెసివ్‌ అండ్‌ రియల్‌ టైం ర్యాంకింగ్స్‌ (స్పార్క్‌)లో జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాలతో పోటీపడి మొదటిస్థానంలో నిలిచింది. పట్టణ పేదలను సంఘటితంగా సంఘాలను ఏర్పాటుచేసి వాటిని బలోపేతం చేయడం ద్వారా వ్యక్తిగత వ్యాపారాల స్థాపన, జగనన్న మహిళా మార్ట్‌లతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసింది. ఒకే రకమైన వ్యాపారాలు చేసే వారిని సామాజిక ఆర్థిక సర్వే ద్వారా గుర్తించి వాటిని సంఘంగా ఏర్పాటు చేసి రుణ సదుపాయం, పిఎం స్వనిధి ద్వారా లబ్ధి కల్పించే కార్యక్రమాల నిర్వహణ, ప్రతి ఒక్క నిరాశ్రయునికి వసతి కల్పించాలనే లక్ష్యంతో నిరాశ్రయ వసతి కేంద్రాలను స్థాపించింది. ఆధార్‌ సీడింగ్‌, ఆర్థిక అంశాల నిర్వహణ, ఈ పోర్టల్‌, ఎలక్ట్రానిక్‌ మోడ్‌ ఇలా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్రానికి మొదటిర్యాంకు కేటాయించింది. కేరళలో నిర్వహించిన జాతీయ వర్క్‌షాప్‌లో కేరళ మంత్రి ఎం.బి.రాజేష్‌ మెప్మా మిషన్‌ డైరెక్టర్‌ వి విజయలక్ష్మికి అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశంలో అనేక పథకాలను ఎప్పటికప్పుడు మహిళలకు చేరువ చేస్తున్నామని వివరించారు.

ప్రతి 250 కుటుంబాలకు ఒక రిసోర్స్‌పర్సన్‌ను, ప్రతి 300 కుటుంబాలకు ఒక కమ్యూనిటీ ఆర్గనైజర్ని, ప్రతి పట్టణానికి సిటీ మిషన్‌ మేనేజర్‌ని నియమించి రాష్ట్రస్థాయిలో క్రమ పద్ధతిలో పనులు చేస్తున్నామని వివరించారు. దీని వెనుక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి తదితరులు ఎంతో కృషి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్‌ సెక్రటరీ, జాతీయ పట్టణ జీవనోపాధుల మిషన్‌ పిఎం స్వనిధి మిషన్‌ డైరెక్టర్‌ రాహుల్‌ కపూర్‌, కుదుంబశ్రీ ఇడి అనుకుమారి, శారద మురళీధరన్‌, మెప్మా మిషన మేనేజర్లు రంగాచార్యులు, ఆదినారాయణ, ఎన్‌.ఎన్‌.ఆర్‌.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందజేస్తున్న కేరళ మంత్రి ఎంబి రాజేష్‌

దళితులపై దాడి అమానుషం

- టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి నేత కళ్లం హరికృష్ణారెడ్డి, మనోహర్‌ రెడ్డి గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరు గ్రామంలో దళితులపై దాడికి పాల్పడటం అమానుషమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. జగన్‌ ప్రభుత్వం కాలకేయులను దళితులపైకి వదిలారని శనివారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని వైసిపి నాయకులు అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారన్నారు. చర్చల పేరుతో దళితులపై దాడి చేస్తారా? అని ప్రశ్నించారు. కంతేరు పంచాయతీలో పారిశుధ్య పనులు చేయడమే తప్పా? అని ప్రశ్నించారు.

దాడి చేసిన వారిని వదిలిపెట్టి దాడికి గురైన వారిపై కేసులు పెట్టడమేంటన్నారు. జగన్‌ పాలనలో దళితులు రెండో తరగతి పౌరుల్లా బతకాల్సిన దుస్థితి వచ్చిందని విమర్శించారు. దళిత మంత్రులు, ఎమ్మెల్యేలకు ఈ దాడులు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. దళితులపై జరిగిన దాడులపై సిఎం ఎందుకు స్పందించడం లేదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు మరో ప్రకటనలో ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను గద్దె దించేందుకు దళితులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

విలీనంతో పాఠశాల విద్య నాశనం

- మాజీమంత్రి జవహర్‌

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్య విలీనంతో నాశనమైందని మాజీ మంత్రి, టిడిపి నేత కెఎస్‌ జవహర్‌ విమర్శించారు. జాతీయ నూతన విద్యావిధానం లోపభూయిష్టమని, కేవలం జగన్‌కే పరిమితమైందని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరిశోధన దశలోనే అమలు చేయాలనుకోవడం జగన్‌ అజ్ఞానమని విమర్శించారు. చర్చలు, సంప్రదింపులు లేకుండా వ్యవస్థను నిర్వీర్యం చేయాలనుకుంటున్నారని అన్నారు. ఎయిడెడ్‌ వ్యవస్థను పూర్తిగా మూసేశారని, కళాశాల విద్య కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సర్దుబాటుతో విద్యా వ్యవస్థను నిర్వహించాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. 3వ తరగతి నుంచే టోఫెల్‌ ఏ విధంగా ఉపయోగించాలో తెలుసా? అని ప్రశ్నించారు. డిఎస్‌సిలు నిర్వహించకుండా టోఫెల్‌ ఎలా సాధ్యమో చెప్పాలన్నారు. బైజూస్‌ ఆరంభ శూరత్వానికి ఓ మచ్చుతునక అని, మీడియంతో విద్యా వ్యవస్థను గందరగోళానికి గురిచేశారని విమర్శించారు. జగన్‌ పరిపాలన దోచుకోవడం, దాచుకోవడానికే తప్ప ప్రజల్ని కాపాడటానికి కాదని మాజీ మంత్రి, టిడిపి నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అత్యాచారాల్లో 30 శాతం, దాడుల్లో 15 శాతం, ఆత్మగౌరవాన్ని అవమానించే సంఘటనలు 31 శాతం వరకు ఈ ప్రభుత్వంలో పెరిగాయని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో ఇప్పటివరకు 52 వేలమంది మహిళలపై అఘాయిత్యాలు, ఇతరత్రా వేధింపులు చోటుచేసుకున్నాయని తెలిపారు. 22,278 వరకు మిస్సింగ్‌ కేసులు నమోదయ్యాయని పేర్కొన్నారు. తన బాబాయిని చంపినవారిని శిక్షించలేని ముఖ్యమంత్రి ప్రజల్ని రక్షిస్తారా? అని ప్రశ్నించారు.

శ్రీవాణి ట్రస్టు నిధులపై విడుదల చేసిన శ్వేతపత్రంలో అన్నీ అవాస్తవాలే అని తెలుగు వాణిజ్య విభాగం అధ్యక్షులు డూండి రాకేష్‌ విమర్శించారు. టికెట్లు కొనుగోలు చేసిన వారి వివరాలు ఎందుకు బహిర్గతం చేయడం లేదని ప్రశ్నించారు.

అదానీ గంగవరం పోర్టులో కార్మికుల తొలగింపు

- విధులు బహిష్కరించిన కార్మికులు
- ఎనిమిది మంది అరెస్టు, విడుదల
- దిగొచ్చిన యాజమాన్యం

ప్రజాశక్తి - గాజువాక (విశాఖపట్నం)

అదానీ గంగవరం పోర్టులో పనిచేస్తున్న నొల్లి స్వామి, సమ్మిడి పరమేష్‌ను శుక్రవారం రాత్రి విధుల నుంచి యాజమాన్యం తొలగించింది. ఈ అంశంపై శనివారం పోర్టు గేటు ఎదుట కార్మికులు మహాధర్నా నిర్వహించారు. ‘ ఇప్పటి వరకూ విధుల నుంచి తొలగించబడిన ఐదుగురు కార్మికులనూ విధుల్లోకి తీసుకోవాలని, గతంలో రెండు సార్లు జరిగిన చర్చల్లో అంగీకరించిన వేతనాలు, ఇతర డిమాండ్లనూ నెరవేర్చాలని పట్టుబట్టారు. అంతవరకూ గేటు దగ్గర నుంచి వెళ్లేది లేదంటూ భీష్మించుకు కూర్చున్నారు. దీంతో పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. కార్మికులు ధర్నాను విరమించకపోవడంతో ఎనిమిది మంది కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో వాతావరణం మరింత వేడెక్కింది. పోర్టులో పనిచేస్తున్న కార్మికులు కూడా విధులు బహిష్కరించి, బయట ధర్నా చేస్తున్న వారికి సంఘీభావం తెలిపారు. కార్మికులనుద్దేశించి సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్‌ డాక్టర్‌ బి.గంగారావు మాట్లాడుతూ.. అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులకు రూ.36 వేలు వేతనం ఇవ్వడంతో పాటు ఇతర డిమాండ్లనూ నెరవేర్చాలని అన్నారు. మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పోలీసులను ఉపయోగించి పోర్టును ఎన్ని రోజులు నడుపుతారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొవిరి అప్పలరాజు, సిపిఐ నాయకులు అచ్యుత్‌, జనసేన కార్పొరేటర్‌ దల్లి గోవింద్‌, వైసిపి నాయకులు ధర్మాల శ్రీను పాల్గొన్నారు.


విధులు బహిష్కరించి ధర్నా చేస్తున్న గంగవరం పోర్టు కార్మికులు

దిగొచ్చిన పోర్టు యాజమాన్యం

కార్మికుల పోరాట ఫలితంగా పోర్టు యాజమాన్యం దిగివచ్చింది. నొల్లి స్వామి, సమ్మిడి పరమేష్‌లపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తున్నామని ప్రకటించింది. అఖిలపక్ష రాజకీయ పార్టీల నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, ఆర్‌డిఒలతో సోమవారం కలెక్టర్‌ సమక్షంలో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చింది. దీంతో కార్మికులు ఆందోళన విరమించారు. చర్చల్లో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సిపిఎం కార్పొరేటర్‌ బి.గంగారావు, గంగవరం పోర్టు ఎంప్లాయీస్‌ యూనియన్‌ ఉపాధ్యక్షులు కొవిరి అప్పలరాజు పాల్గొన్నారు.

2 వేల గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీకి సన్నద్ధం

- సెప్టెంబరు 30 నాటికి పూర్తి చేయాలి
- సిఎస్‌ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రెండో దశ భూముల రీ సర్వే చేపట్టిన రెండు వేల గ్రామాల్లో సెప్టెంబరు 30 నాటికి సరిహద్దు రాళ్ల పాతి, భూహక్కు పత్రాల పంపిణీని పూర్తి చేయాలని కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్‌ జవహర్‌రెడ్డి ఆదేశించారు. జగనన్న భూహక్కు, భూముల రీసర్వే, ప్రాధాన్యత గల భవన నిర్మాణాలు, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలపై 26 జిల్లాల కలెక్టర్లు, జాయింట్‌ కలెక్టర్లతో సిఎం ముఖ్య సలహాదారులు అజయ్‌కల్లాంతో కలిసి శనివారం విజయవాడలోని సిఎస్‌ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ నిర్వహించారు. రెండో దశ భూహక్కు పత్రాల పంపిణీ పూర్తి చేసేందుకు ఒక టైమ్‌లైన్‌ పెట్టామని, జులై 31 నాటికి విలేజ్‌ సర్వేయర్‌ లాగిన్‌ డేటా ఎంట్రీ ప్రక్రియను పూర్తిచేయాలని సిఎస్‌ పేర్కొన్నారు. ఆగస్టు 31 నాటికి ఫైనల్‌ ఆర్‌ఒఆర్‌ను పూర్తిచేసి పబ్లికేషన్‌ను కూడా పూర్తి చేయాలని తెలిపారు. సెప్టెంబరు 30 నాటికి రాళ్లు పాతడంతోపాటు భూహక్కు పత్రాల పంపిణీ కూడా పూర్తి చేయాలని ఆదేశించారు. అక్టోబరు 15 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభించాలన్నారు. నిర్ధేశించిన గడువు ప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. పొరపాట్లు జరగకుండా కలెక్టర్లు, జాయింట్‌ కలెక్టర్ల స్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. గ్రామ సచివాలయాల భవనాలు, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను సెప్టెంబరు 15 నాటికి పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాంలో భాగంగా వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, సిసిఎల్‌ఎ జి సాయి ప్రసాద్‌ మాట్లాడుతూ.. రెండో దశ భూముల రీసర్వే జరుగుతున్న తీరుపై ప్రతిరోజూ కలెక్టర్లు మానిటరింగ్‌ చేయాలన్నారు. ఇప్పటి వరకు 2 లక్షల మ్యుటేషన్లు 4 లక్షల సబ్‌ డివిజన్లు జరిగాయని తెలిపారు. వీటితోపాటు ఐదారు లక్షల సరిహద్దు వివాదాలు పరిష్కారమయ్యాయన్నారు. సిఎం ముఖ్య సలహాదారు అజయ్‌కల్లాం మాట్లాడుతూ.. ఎన్‌ఆర్‌ఐలకు సంబంధించిన భూమి పత్రాలను డిజిటల్‌ రూపంలో పంపాలని కలెక్టర్లకు సూచించారు.

రాష్ట్ర సర్వే సెటిల్‌మెంట్‌శాఖ కమిషనరు సిద్ధార్థజైన్‌ మాట్లాడుతూ.. గతంలో సర్వే రాళ్లను 13వ నోటిఫికేషన్‌ అయ్యాక పాతేవారని, కానీ ఇప్పుడు ఆర్‌ఒఆర్‌ పూర్తయ్యే వరకు వేచి చూడకుండా ఏకకాలంలోనే రాళ్లను పాతాలని చెప్పామన్నారు. ఇప్పటికే 700లకు పైగా గ్రామాల్లో ఆర్‌ఒఆర్‌ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. సిఎంఒ అదనపు కార్యదర్శి ఆర్‌ ముత్యాలరాజు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. అదనపు సిసిఎల్‌ఎ ఇంతియాజ్‌ భూ హక్కు రీ సర్వే జరుగుతున్న తీరును పవర్‌ పాయింట్‌ ప్రెజెంటేషన్‌ ద్వారా వివరించారు. వీడియోకాన్ఫరెన్స్‌ ద్వారా పాల్గొన్న పంచాయతీరాజ్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్‌ మాట్లాడుతూ.. ఇప్పటికే 6 వేల 84 గ్రామ సచివాలయాల భవనాలు పూర్తి కాగా, 1861 ఫినిషింగ్‌ టచ్‌లో ఉన్నాయని, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి ఇప్పటికే 3,609 భవనాలు పూర్తికాగా, 1100 బేస్‌మెంట్‌ స్థాయిలోనూ, 966 రూఫ్‌ స్థాయిలోనూ ఉన్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సిసిఎల్‌ఎ జాయింట్‌ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, సిఎంఒ పిఎంయు డిప్యూటీ కలెక్టరు భవానీ పాల్గొన్నారు.

26న పశుసంవర్ధకశాఖ కార్యాలయం ముట్టడి

- డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పశు సంవర్ధకశాఖలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, క్లస్టర్‌ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ చేస్తూ ఈ నెల 26న పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు డివైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న వెల్లడించారు. పశుసంవర్ధక అసిస్టెంట్ల (ఎహెచ్‌ఎ) కమిటీతో కలిసి ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో శనివారం రామన్న విలేకరులతో మాట్లాడారు. కొత్తగా క్లస్టర్‌ విధానాన్ని ప్రవేశపెట్టి ఆర్‌బికెల్లో పోస్టులు మిగులుగా చూపించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. దీనివల్ల రాష్ట్రంలో మూడేళ్ల నుంచి డెయిరీ ఒకేషనల్‌, డిప్లమో చదివిన 30 వేలమంది అభ్యర్థులు నష్టపోతారని తెలిపారు. నోటిఫికేషన్‌ వస్తుందని కోచింగ్‌ సెంటర్లకు వేలకు వెలు ఖర్చుచేసి శిక్షణ పొందుతున్నారన్నారు. ఆర్‌బికేల్లో క్లస్టర్‌ విధానంపై ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు.

పోస్టులు భర్తీ, క్లస్టర్‌ విధానం రద్దు చేయాలని కోరుతూ ప్రజా ప్రతినిధులను, అధికారులను పలుమార్లు కలిసి కోరామని తెలిపారు. వివిధ రూపాల్లో ఆందోళనలు కూడా నిర్వహించామని చెప్పారు. ప్రభుత్వం నుంచి వెటర్నటీ నోటిఫికేషన్‌ విడుదల విషయంలో ఎలాంటి స్పందన లేదని తెలిపారు. డిమాండ్ల సాధన కోసం పశు సంవర్ధకశాఖ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొని డిమాండ్లను సాధించుకుందామని, వెటర్నటీ అసిస్టెంట్‌ అభ్యర్థులంతా ఈ ముట్టడిలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆయనతోపాటు డివైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్‌ నాగేశ్వరరావు, నాయకులు నిజాముద్దీన్‌, శివ తదితరులు ఉన్నారు.

ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన గ్రామాలన్నీ నిర్వాసిత గ్రామాలే

- నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్‌ ప్రకటించాలి
- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు (ఎ.యస్‌.ఆర్‌. రంపచోడవరం) జిల్లా ఎటపాక మండలంలో పోలవరం ప్రాజెక్టు 37 మీటర్ల వద్దనే ముంపునకు గురైన అన్ని గ్రామాలనూ నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి నష్టపరిహారం అందించాలని, ఆర్‌అండ్‌ఆర్‌ ప్రకటించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. పోలవరం ముంపు ప్రాంతాల పర్యటనలో ఉన్న ఆయన ఎటపాక మండల ప్రజలు పడుతున్న ముంపు సమస్యలపై శనివారం ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. ఈ నెల 20, 21 తేదీల్లో ఎటపాక మండలంలో పాదయాత్ర చేస్తున్న సమయంలో ఆయా గ్రామాల ప్రజలను కలుసుకున్నప్పుడు అనేక సమస్యలు తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. 2022 జులై నెలలో వచ్చిన వరదలకు ఈ మండలంలో 67 గ్రామాలు నీట మునిగాయని, పోలవరం నిర్వాసితుల లిస్టులో ఈ గ్రామాలు లేవని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టు కట్టడానికి నిర్ణయించుకున్నప్పుడు 2006లో ఎటపాక మండలంలో 13 గ్రామాలను మాత్రమే ముంపు ప్రాంతంగా ప్రకటించిందని పేర్కొన్నారు. సిపిఎం దశలవారీ పోరాడిన ఫలితంగా 2013 నిర్వాసితుల చట్టాన్ని సాధించిన తర్వాత అనేక పోరాటాల క్రమంలో మండలంలో 42 గ్రామాలనూ నిర్వాసిత గ్రామాల లిస్టులో చేర్చినట్లు తెలిపారు. ఈ మండలం 41.15 మీటర్ల కాంటూరు పరిధిలో లేదని, గత వరదల్లో 37 మీటర్ల వద్దనే మండలం అంతా మునిగిపోయిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. గత జులైలో వచ్చిన వరదలకు ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, కరెంటు లేక, ఆరోగ్య సౌకర్యాలు అందక, రవాణా సౌకర్యాలు లేక, చీకట్లో మగ్గిపోయారని తెలిపారు. తినడానికి తిండి లేక ఆకలికి అలమటించారని వివరించారు. మునిగే గ్రామాలు 67 కాగా, పరోక్షంగా ఈ వరద తాకిడికి గురయ్యే గ్రామాలు మరో 20 ఉంటాయని, దాదాపు 90 గ్రామాలు గోదావరి వరదతోపాటు పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌ వాటర్‌ వల్ల ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా 42 గ్రామాలను మాత్రమే ప్రకటించిందని, ఈ గ్రామాలూ 45.72 కాంటూరులో ఉన్నట్లుగా చెబుతున్నా 37వ కాంటూరు వద్ద ఎటపాక మండలంలోని 67 గ్రామాలను ముంచేసిందని లేఖలో ప్రస్తావించారు. ఈ కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా ఒకేసారి ఎటపాక మండలంలో వరద తాకిడికి గురైన అన్ని గ్రామాలనూ నిర్వాసిత గ్రామాలుగా గుర్తించి వారికి నష్టపరిహారం, ఆర్‌అండ్‌ఆర్‌ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఇంటికి ఇల్లు, ఆర్‌అండ్‌ఆర్‌ ప్యాకేజీ ప్రకారం అందరికీ డబ్బులు చెల్లించి, ముంపు లేనిచోట ఇళ్లు కట్టించి ఇవ్వాలని కోరారు. ఈ సంవత్సరం వరదలు రాకముందే ముందస్తు చర్యలు తీసుకుని అన్ని సౌకర్యాలూ సిద్ధం చేయాలన్నారు.

పోలవరం బాధితులకు పునరావాసం కల్పించాలి

- కేసుల కోసం సిఎం జగన్‌ తాకట్టు పెట్టారు
- ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్‌

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పోలవరం ముంపు బాధితులకు పరిహారం, పునరావాసం కల్పించాలని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్‌ డిమాండ్‌ చేశారు. శనివారం నాడిక్కడ ఎపి, తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ‘పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పిస్తూ విభజన చట్టంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రాజెక్టు అర్థాన్ని మార్చేస్తుంది. నిర్మాణ వ్యయం ఇస్తాం. కానీ పునరావాసం కల్పించబోమని కేంద్రం అంటుంది. కేసుల కోసం జగన్‌ సరెండర్‌ అయ్యి పోలవరాన్ని కేంద్రానికి తాకట్టు పెట్టారు. గత కొన్నేళ్లుగా పోలవరానికి నిధులు ఇవ్వడం లేదు. లక్ష మంది ప్రజలకు రూ.34 వేల కోట్ల పునరావాస ప్యాకేజీ ఇవ్వాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముంపు బాధితులకు పునరావాస నిధులు ఇవ్వకపోవడాన్ని ఖండిస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ వైఖరి అన్యాయంగా ఉంది. ముంపు బాధితులను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి. ఇప్పటికే సిపిఎం పాదయాత్ర నిర్వహించింది. ప్రజలు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే సమయం వస్తుంది’ అని హెచ్చరించారు.

‘అసైన్డ్‌ భూములు అమ్ముకోవడానికి జగన్‌ ప్రభుత్వం చట్టం చేయబోతుంది. అన్యాక్రాంతమైన భూములు కబ్జాదారులకు అనుకూలంగా చట్టం చేయబోతున్నారు. విశాఖ, విజయవాడ, గుంటూరులో అసైన్డ్‌ భూములు కాజేయడానికి జగన్‌ కుట్ర చేస్తున్నారు. అసైన్డ్‌ భూములు అమ్ముకోవడానికి తెస్తున్న చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం’ అని వెంకట్‌ అన్నారు. “అభివృద్ధి పేరుతో తెలంగాణలోని హైదరాబాద్‌లో పేదల నుంచి అన్యాయంగా భూములు లాగేసుకుంటున్నారు. భూ రక్షణ ఉద్యమాలు దేశవ్యాప్తంగా నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నాం. అసైన్డ్‌ భూములు తీసుకోవడం వల్ల దళితులు, పేదలకు నష్టం జరుగుతుంది’ అని అన్నారు.

స్టీల్‌ ప్లాంట్‌ పరిరక్షణకు పోరాడుదాం

- సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

ప్రజాశక్తి-ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ ప్లాంట్‌ పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయనున్నట్లు సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు అన్నారు. సిఐటియు విశాఖపట్నం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల సంయుక్త సమావేశం ఉక్కునగరంలోని ఆంధ్రకేసరి కల్యాణ మండపంలో శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఎవి.నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. గత 863 రోజులుగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గడం లేదన్నారు. ఈ పోరాటాన్ని మరింత ఉధతం చేయడంలో భాగంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలన్నారు. విశాఖ అభివృద్ధిలో స్టీల్‌ ప్లాంట్‌ కీలక పాత్ర పోషించిందని తెలిపారు. స్టీల్‌ ప్లాంట్‌ ప్రయివేటీకరణపై బిజెపి ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్తోందని, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాల్సిన వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలకడం సరికాదన్నారు. స్టీల్‌ ప్లాంట్‌ ప్రయివేటీకరణలో భాగంగానే మోడీ సర్కారు ప్లాంట్‌లో ఉత్పత్తిని తగ్గించి, కొన్ని విభాగాలను మూసివేసిందని, ముడి సరుకు అందకుండా చేసి ప్లాంటును నిర్వీర్యం చేయాలని చూస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలకు వ్యతిరేకంగా స్టీల్‌ ప్లాంట్‌ పరిరక్షణ కోసం ఉద్యమాన్ని ఉధృతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్‌ అధ్యక్షతన జరిగిన సమావేశంలో అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం, స్టీల్‌ జోన్‌ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు రామస్వామి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జీడి రైతులను దోచుకునే ఎత్తుగడ

- పరిశ్రమల బంద్‌ పేరుతో యాజమాన్యాల డ్రామాలు
- మంత్రులు, స్పీకర్‌ ఎందుకు స్పందించడం లేదు
  : వామపక్షాల నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జీడి పరిశ్రమల బంద్‌ పేరుతో యాజమాన్యాలు రైతాంగాన్ని, కార్మికులను తీవ్రంగా దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్‌) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శులు డి.గోవిందరావు, బి.శ్రీరామ్మూర్తి, తాండ్ర ప్రకాశరావు విమర్శించారు. శ్రీకాకుళంలోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు శనివారం మాట్లాడారు. జీడి యాజమాన్యాలు జులై ఐదు నుంచి ఆగస్టు ఒకటో తేదీ వరకు జీడి పరిశ్రమల బంద్‌ పేరుతో జీడి రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని విమర్శించారు. బంద్‌ పేరుతో తక్కువ ధరకు జీడి పిక్కలు తీసుకోవడానికి డ్రామాలాడుతున్నాయని దుయ్యబట్టారు. రైతులకు రెట్టింపు ఆదాయం ఇస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీడికి మద్దతు ధర ప్రకటించి ఎందుకు కొనుగోలు చేయడం లేదని ప్రశ్నించారు. జీడి పరిశ్రమలను బంద్‌ చేస్తామని వ్యాపారులు చేసిన ప్రకటనపై జిల్లా మంత్రులు, స్పీకర్‌ స్పందించాలని డిమాండ్‌ చేశారు. మద్దతు ధరపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని రైతుభరోసా కేంద్రాల ద్వారా జీడి పిక్కలు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌ చేశారు. 80 కేజీల జీడిపిక్కల బస్తాకు రూ.16 వేలు మద్దతు ధర ఇవ్వాలని, కేరళ తరహాలో జీడి బోర్డు ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్‌ చేశారు. జీడి పంటకు మద్దతు ధర వచ్చే వరకు ప్రజల మద్దతుతో దశల వారీ పోరాటం చేస్తామని హెచ్చరించారు.



మహాపాదయాత్రకు సంఘీభావం తెలియజేస్తున్న పారిశుధ్యకార్మికులు



కొండ, కోనలను దాటి ముందుకు సాగుతున్న మహాపాదయాత్ర

నిర్వాసితుల పట్ల ప్రభుత్వాల తీవ్ర నిర్లక్ష్యం

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ ఛైర్మన్ మిడియం బాబూరావు



సభలో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, చింతూరు

పోలవరం నిర్వాసితుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ మిడియం బాబూరావు అన్నారు. పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం సిపిఎం చేపట్టిన పోరుకేక మహా పాదయాత్ర ఐదో రోజైన శనివారం చింతూరు జిల్లాలో సుమారు 15 కిలోమీటర్లు సాగింది. ఈ సందర్భంగా చింతూరు, నర్సింగపేట, తిమ్మిరిగూడెం, ఎజి కోడేరు, ఉలుమూరు, మల్లెతోటలలో బహిరంగ సభలు జరిగాయి. ఈ సభలకు మండల కార్యదర్శి సీసం సురేష్ అధ్యక్షత వహించారు. తొలుత నర్సింగపేటలో పోలవరం నిర్వాసితులతో మాట్లాడారు. సోడి బాయమ్మ అనే నిర్వాసితురాలు మాట్లాడుతూ గతేడాది వచ్చిన వరదలకు తమ ప్రాంతం ముంపునకు గురైందని తెలిపారు.

నెల రోజుల పాటు సమీపంలోని నూనెవారి గూడెం కొండపై బరకాలతో గుడారాలు వేసుకుని జీవించామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎజి కోడేరులో నిర్వాసితుడు అంగర బుచ్చయ్య మాట్లాడుతూ తమ ప్రాంతం 45వ కాంటూరులో ఉందని, గత ఏడాది వచ్చిన వరదల కారణంగా ఇల్లు కోల్పోయానని తెలిపారు. కూలిపోయిన ఇంటికి ప్రభుత్వం రూ.10 వేలు మాత్రమే ఇచ్చిందని, పునర్నిర్మాణం కోసం రూ.50 వేలు వెచ్చించానని వివరించారు. మల్లెతోట గ్రామంలో సోడె జానకమ్మ అనే మహిళ మాట్లాడుతూ గత వరదలకు తన ఇల్లు పూర్తిగా ముంపునకు గురై కూలిపోయిందని తెలిపారు. ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంతో తాటాకు గూడు కింద బరకాలు, దుప్పట్లను గోడలుగా కట్టుకుని తన ఇద్దరు కుమార్తెలు, భర్తతో నివాసం ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మిడియం బాబూరావు మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పోలవరం నిర్వాసితుల పోరాటంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గతేడాది వచ్చిన వరదలు మిగిల్చిన విషాదాన్ని గుర్తు చేశారు. పోలవరం పెత్తందారులకు, ప్రభుత్వానికి వరంలా మారిందని విమర్శించారు. విభజన చట్టం ప్రకారం పోలవరం నిర్మాణానికి ప్రతి రూపాయి చెల్లించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు.

గ్రామ సభలు జరపకుండా, ప్రజలకు పునరవాసం కల్పించకుండా ప్రాజెక్టు పూర్తి చేస్తామనడం చట్టవిరుద్ధమని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు రూ.57 వేల కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటికి రూ.7 వేల కోట్లు మాత్రమే చెల్లించిందన్నారు. రాష్ట్రంలోని గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు చేసిన అన్యాయానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఈ పోరాటంలో యువత భాగస్వాములు కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

అల్లూరి స్ఫూర్తితో మరో పోరాటానికి సిద్ధం : పి మధు

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోలవరం నిర్వాసితులు మరో పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు పిలుపునిచ్చారు. నర్సింగపేట, ఎజి కోడేరులలో నిర్వహించిన సభలలో ఆయన ప్రసంగించారు. గిరిజనులకు అడవిపై హక్కును దూరం చేసేందుకు కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి అమానుష చర్యలకు ఒడిగడుతున్నాయన్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించకుండా ప్రాజెక్టును ఎలా పూర్తి చేస్తారంటూ నిలదీశారు. 'ఆదివాసీలు అమాయకులు కాదు... ఘనమైన పోరాట చరిత్ర కలిగిన పోరాటయోధులు.. ఖబడ్దార్' అంటూ హెచ్చరించారు. పోలవరం నిర్వాసితులకు డబ్బులు ఎగ్గొట్టేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాంటూరుల పేరుతో దొంగ లెక్కలు చూపుతున్నాయని విమర్శించారు.

ప్రతి పైసా నిర్వాసితులకు ఇవ్వాల్సిందే : వివిఎస్ఆర్

ఢిల్లీ నుంచి వచ్చే ప్రతి పైసా నిర్వాసితులకు చెల్లించాల్సిందేనని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. నర్సింగపేట, ఎజి కోడేరు, మల్లెతోటలలో నిర్వహించిన సభలలో ఆయన మాట్లాడారు. నర్సింగపేటలో చిన్నారులను పలకరించారు. చిన్నారుల భవిష్యత్తును అంధకారం చేసే హక్కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎవరిచ్చారని నిలదీశారు. రేపటి తరం భవిష్యత్తు కోసం పోలవరం నిర్వాసితులు పార్టీలకతీతంగా ఐక్యం కావాలని, పాలక ప్రభుత్వాలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

సిపిఎం తెలంగాణ కమిటీ సంపూర్ణ మద్దతు

పోలవరం నిర్వాసితుల పోరాటానికి సిపిఎం తెలంగాణ కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. కుంజా బొజ్జి, సున్నం రాజయ్య స్ఫూర్తితో ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

ముంపులో ఒడిశాలోని 8 గ్రామాలు : బ్రజామాజీ

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి జిల్లా మోటు తాలూకాలో 8 గ్రామాల వరకూ ముంపునకు గురవుతున్నాయని సిపిఎం మల్కన్‌గిరి జిల్లా కార్యదర్శి బ్రజామాజీ అన్నారు. ఇవన్నీ ఆదివాసీ గ్రామాలేనని తెలిపారు. కనీసం ప్యాకేజీ, పరిహారం మాట కూడా మాట్లాడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు.

పార్టీలకు అతీతంగా కలిసిరావాలి : జనసేన

పార్టీలకు అతీతంగా పోలవరం పోరుకేక మహా పాదయాత్రకు కదిలి రావాలని జనసేన చింతూరు మండల అధ్యక్షులు మడివి రాజు కోరారు. నర్సింగపేటలో పాదయాత్రకు స్వాగతం పలికిన ఆయన తన సంఘీభావాన్ని తెలిపారు. పోలవరం నిర్మాణంతో లక్షలాది మంది ప్రజలు ముంపునకు గురవుతున్నారన్నారు. ఈ పరిస్థితుల్లో నిర్వాసితులకు అండగా సిపిఎం చేపట్టిన పోరాటంలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు.

'పోరుకేక' @ 100 కిలోమీటర్లు

- ఐదో రోజుకు చేరిన మహా పాదయాత్ర
- ఎరుపెక్కిన చింతూరు
- మద్దతు తెలిపిన జనసేన, సిపిఎం ఒడిశా రాష్ట్ర నేతలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

చింతూరు డివిజన్ కేంద్రం శనివారం ఎరుపెక్కింది. పోలవరం నిర్వాసితుల హక్కుల సాధన కోసం ఈ నెల 20న ప్రారంభమైన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర ఐదో రోజు చింతూరులో సాగింది. సాయంత్రానికి పాదయాత్ర వంద కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ఉదయం చింతూరులోని ఎర్రంపేటలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నాయకత్వాన ఈ యాత్ర ప్రారంభమైంది. యాత్రలో భాగంగా ఎజి కోడేరులో జరిగిన సభలో మాజీ ఎంపి, ఆదివాసీ రాష్ట్రీయ మంచ్ జాతీయ చైర్మన్ డాక్టర్ మిడియం బాబూరావు పాల్గొని ప్రసంగించారు. నర్సింగపేట నుంచి మాజీ ఎంపి, సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ పాదయాత్రలో పాల్గొన్నారు. వారి ప్రసంగాలు నిర్వాసితుల్లో మరింత ఉత్సాహాన్ని నింపాయి. పోలవరం నిర్వాసితులతోపాటు రెడ్ షర్ట్ వలంటీర్లు రెండు లైన్లుగా కవాతు నిర్వహించారు. చింతూరు మెయిన్ రోడ్డు మీదుగా శబరి ఒడ్డు సంతపాకలకు యాత్ర చేరింది. పాదయాత్రకు శబరి ఒడ్డున నిర్వాసితులు తిలకం దిద్ది హారతి పట్టి స్వాగతం పలికి తమ వంతు ఆర్థిక సాయం అందజేశారు. ప్రధాన రహదారి పక్కనే ఉన్న చిరు వ్యాపారులను పాదయాత్ర బృందం కలిసి సమస్యలను అడిగి తెలుసుకుంది. చింతూరు పంచాయతీ పారిశుధ్య కార్మికులు పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. అనంతరం చూటూరు మీదుగా సోకులేరు వాగును దాటారు. సోకులేరు వాగుపై నడిచిన ఎర్ర కవాతు పోలవరం నిర్వాసితులలో మరింత ఉత్సాహాన్ని నింపింది. రహదారిపై వెళ్లే వారు సైతం ఆగి ఎర్ర కవాతును తమ ఫోన్లలో ఫొటోలు తీసుకోవడం కనిపించింది. జోరువానలోనూ యాదయాత్ర కొనసాగింది. మల్లెతోట గ్రామంలో గత వరదలలో పూర్తిగా ధ్వంసమైన ఇళ్లను నాయకులు సందర్శించారు. ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ పాదయాత్రలో పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, జిల్లా కార్యదర్శి పులి సంతోష్, సిపిఎం చింతూరు మండల కార్యదర్శి సీసం సురేష్, నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పూనెం సత్యనారాయణ, పల్లపు వెంకట్, మట్ల వాణిశ్రీ, ప్రజాప్రతినిధులు కారం లక్ష్మి, కుంజా రాధ, లావణ్య, నాయకులు పొడియం లక్ష్మణ్, కారం నాగేష్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న దళిత, ప్రజా సంఘాల నాయకులు

తిరుమలాయపాలెంలో
కొనసాగుతున్న సాంఘిక బహిష్కరణ

- బాధితులకు నిత్యావసరాలు అందించేందుకు దళిత పోరాట కమిటీ యత్నం
- వాహనాలను అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం తిరుమలాయపాలెం అంబేద్కర్ విగ్రహ ఘటనపై ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. తిరుమలాయపాలెం గ్రామంలోని దళితులను పెత్తందారులు సాంఘిక బహిష్కరణ చేశారు. దళితులకు ఆహార పదార్థాలు, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందకుండా కట్టడి చేశారు. మెడికల్ షాపుల నుంచి మందులనూ ఇవ్వకూడదని, తమ ఆదేశాలను ధిక్కరిస్తే ఆయా దుకాణం స్థాయిని బట్టి రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకూ జరిమానా విధిస్తామని పెత్తందారులు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో, దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారికి అండగా రాజకీయాలకు అతీతంగా రాజకీయ, దళిత, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో తిరుమలాయపాలెం దళిత పోరాట కమిటీ ఏర్పాటైంది. గ్రామంలో పోలీసు ఆంక్షలు ఎత్తివేయడంతో తూర్పుగోదావరి నుంచి తిరుమలాయపాలెం దళిత పోరాట కమిటీ నాయకులు బహిష్కరణకు గురైన బాధితులకు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయాలు అందించేందుకు శనివారం సిద్ధమయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు నిత్యావసర సరుకులు కలిగిన వాహనాలను అడ్డుకున్నారు. దీన్ని నిరసిస్తూ తిరుమలాయపాలెం దళిత పోరాట కమిటీ ప్రతినిధులు రాజమహేంద్రవరంలోని క్వారీ సెంటర్‌లో రాస్తారోకోకు దిగారు. ఆ సమయంలో నిరసనకారులు, పోలీసులకు మధ్య తీవ్ర స్థాయిలో వాగ్వావాదం చోటుచేసుకుంది. దళిత పోరాట కమిటీ సభ్యులను బలవంతంగా అరెస్టు చేసి త్రీటౌన్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వారిని విడుదల చేశారు. ఈ అరెస్టులను కమిటీ నాయకులు అజ్జరపు వాసు, టి.అరుణ్, జువ్వల రాంబాబు, భానుచందర్, తురకల నిర్మల, కప్పల వెలుగుకుమారి తదితరులు తీవ్రంగా ఖండించారు.

పాస్టర్ల అభ్యున్నతికి కృషి

- యువగళం పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - ఓజిలి (తిరుపతి జిల్లా)

వైసిపి అధికారం చేపట్టిన తరువాత క్రైస్తవ సోదరుల అభ్యున్నతిని విస్మరించిందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 136వ రోజుకు చేరింది. శనివారం వెంకటగిరి నియోజకవర్గం ఓజిలి మండలంలోని వజ్జావారిపాలెం నుంచి ప్రారంభమైన పాదయాత్ర తిరుమలపూడి, మాచవరం, ముమ్మాయిపాళెం, కోనేటిరాజుపాళెం రోడ్డు మీదుగా నాయుడుపేట మండలం మేనకూరు వరకు యాత్ర చేరుకుంది. పాదయాత్రలో భాగంగా వజ్జావారిపాలెంలో పాస్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ 2014లో రాష్ట్ర విభజనను ఆంధ్రులు కోరుకోలేదని, కట్టుబట్టలతో మెడపట్టుకుని గెంటేశారని తెలిపారు. ఆనాడు రాష్ట్రం రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్నా ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా చంద్రబాబునాయుడు పాలన చేశారని తెలిపారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుక అందజేశారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పాస్టర్ల అభ్యున్నతికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో టిడిపి నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొండేపాటి గంగా ప్రసాద్, అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎంపి జెసి దివాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పరసా వెంకటరత్నం, నెలవల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'ఫెర్రో' పరిశ్రమలకు విద్యుదాఘాతం

- గుదిబండగా డిమాండ్ ఛార్జీలు
- జులై ఒకటి నుంచి మూసివేత!
- నష్టాలతో నడపలేమంటున్న యాజమాన్యాలు
- రోడ్డున పడనున్న 50 వేల కార్మిక కుటుంబాలు



ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి

పెంచిన విద్యుత్ ఛార్జీల భారం భరించలేక విద్యుత్ ఆధారిత ఫెర్రో పరిశ్రమలు నడపలేని స్థితికి చేరుకున్నాయి. ఎనర్జీ ఇన్సింటివ్ ఇండస్ట్రీస్ పేర డిమాండ్ ఛార్జీలు కిలోవాట్‌కు రూ.475 పెంచడంతో ఉత్పత్తి వ్యయం భారీగా పెరిగింది. డిమాండ్ ఛార్జీలకు తోడు ట్రూఅప్, ఇంధన ఛార్జీలు, వినియోగ ఛార్జీలు సహా ఎలక్ట్రిసిటీ డ్యూటీ (ఇడి) కూడా హెచ్చయింది. యూనిట్‌కు ఆరు పైసలున్న ఇడి ఛార్జీలను రూపాయికి పెంచడంతో ఫెర్రో ఎల్లాయీస్ కంపెనీలకు విద్యుత్ భారం తడిసిమోపుడైంది. మొత్తం ఈ భారమంతా కలిపి యూనిట్‌కు ఎనిమిది రూపాయలకుపైగా చెల్లిస్తున్నట్లు యాజమాన్య ప్రతినిధులు చెబుతున్నారు. ఫెర్రో ఉత్పత్తి ఖర్చులకు తగినట్లు అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరగకపోవడం, ముడిసరుకు ధరలు తగ్గకపోవడంతో నష్టాలతో పరిశ్రమలు నడుస్తున్నాయి. రాష్ట్రంలో ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు 36 ఉన్నాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 17, అనకాపల్లి జిల్లాలో ఐదు, మిగిలినవి రాష్ట్రంలో ఇతర చోట్ల ఉన్నాయి. వీటిలో దాదాపు 50 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు విద్యుత్ రాయితీ ఇవ్వకపోతే వచ్చే నెల నుంచి ఉత్పత్తి నిలిపివేయాలని యాజమాన్యాలు తీసుకున్న నిర్ణయం వల్ల వీరంతా రోడ్డున పడనున్నారు.

ఇప్పటికే మూతబడిన 3 పరిశ్రమలు

విద్యుత్ ఛార్జీల భారం భరించలేక విజయనగరం జిల్లా బొబ్బిలిలోని ఇంపెక్స్, మెరకముడిదాం మండలం గర్భాంలోని ఆంధ్రా ఫెర్రో ఎల్లాయీస్, అనకాపల్లి జిల్లాలోని సరోజిని ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు ఇప్పటికే మూతపడ్డాయి. ప్రభుత్వం ఆదుకోకపోతే మిగిలిన 33 పరిశ్రమలూ మూతపడనున్నాయని యాజమాన్యాలు చెప్తున్నాయి. వివిధ రూపాల్లో విద్యుత్ ఛార్జీలు పెంచడంతో టన్ను ఒక్కంటికీ రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టం వాటిల్లుతోందని అంటున్నాయి. ఇతర దేశాల్లో యూనిట్ విద్యుత్ రూపాయి యాభై పైసల నుంచి రెండు రూపాయల మధ్య ఉండగా, మన రాష్ట్రంలో ఎనిమిది రూపాయలుపైగా ఉందని చెప్తున్నాయి. ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉన్న దేశాల పరిశ్రమలతో పోటీపడలేక పరిశ్రమలను మూసేయాలన్న నిర్ణయానికి వచ్చామని అంటున్నాయి. ఫెర్రో ఉత్పత్తులను ఎక్కువగా జపాన్, తైవాన్, రష్యా, ఆస్ట్రేలియా, ఇతర యూరప్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. గతంలో డిమాండ్ ఛార్జీల నుంచి ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలకు మినహాయింపు ఇచ్చిన ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరం నుంచి కిలోవాట్‌కు రూ.475 చొప్పున వసూలు చేస్తోంది. ఇది ఫెర్రో పరిశ్రమలకు శరాఘాతంగా మారింది. డిమాండ్ ఛార్జీలూ పెరగడంతో అచ్యుతాపురం సెజ్‌లో 1.40 లక్షల కిలోవాట్‌ల లోడ్ కలిగిన అభిజిత్ ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమ నెలకు రూ.5.32 కోట్ల నుంచి రూ.6.65 కోట్లు చెల్లించాల్సి వస్తోంది. ఇదికాకుండా నెలకు వినియోగించిన 8 కోట్లకుపైగా యూనిట్లకు యూనిట్ ఒక్కంటికీ రూపాయి చొప్పున ఇడి కింద రూ.8 కోట్లు చెల్లిస్తోంది. ఎపి విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఇఆర్‌సి) నిబంధనల ప్రకారం పరిశ్రమ సామర్థ్యానికి తగినట్లు విద్యుత్ వినియోగించుకున్నా, లేకపోయినా లోడ్‌లో ప్రతి నెలా 80 శాతానికి డిమాండ్ ఛార్జీలు చెల్లించాల్సి ఉంది. ఈ నిబంధన తమకు భారంగా మారిందని యాజమాన్యాలు అంటున్నాయి.

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని ఫెర్రో ఎల్లాయీస్ పరిశ్రమలు ప్రతి నెలా చెల్లించాల్సిన డిమాండ్ ఛార్జీలు


పరిశ్రమ పేరు	లోడ్ (కెవిఎ)	డిమాండ్ ఛార్జీ (రూ.కోట్లలో)	80 శాతం (రూ.కోట్లలో)
అభిజిత్	1.40 లక్షలు	6.65	5.32
సుందరం	40 వేలు	1.90	1.52
మెథాన్	55 వేలు	2.61	2.09
రాజరాజేశ్వరి	63 వేలు	2.99	2.39
సరోజిని	8 వేలు	38 లక్షలు	30.4 లక్షలు

దళితులపై దాడి దుర్మార్గం

దోషులను తక్షణం అరెస్టు చేయాలి
బాధితులకు సిపిఎం, కెవిపిఎస్ నాయకుల పరామర్శ

ప్రజాశక్తి-తాడికొండ (గుంటూరు జిల్లా)

దళిత యువకులపై దాడి చేసిన ఆధిపత్య కులానికి చెందిన వైసిపి నాయకులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడికొండ మండలం కంతేరులో ఇటీవల అగ్రకులానికి చెందిన వైసిపి నాయకుల దాడికి గురైన దళిత యువకులను నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. స్థానికంగా జరిగిన గొడవను ఆసరాగా చేసుకొని వైసిపి నాయకులు ఐదుగురు దళిత యువకులను మామిడితోటలోకి పిలిచి దాడి చేసి గాయపరచడం దుర్మార్గమని అన్నారు. వారిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేర్చగా పూర్తి స్థాయిలో వైద్యం అందించలేదని తెలిపారు. దాడిలో పాల్గొన్న 40 మందిపై చట్టపరమైన చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.



బాధితుడిని పరామర్శిస్తున్న సిపిఎం, కెవిపిఎస్ నాయకులు

పాశం రామారావు మాట్లాడుతూ దళిత యువకులపై దాడిచేసిన వారిపై ఎస్సి, ఎస్టి అట్రాసిటి కేసు నమోదు చేయాలన్నారు. దాడి చేసిన వారే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కౌంటర్ కేసు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి దాడి చేసిన వారిని అరెస్టు చేయకుంటే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకుని ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాస జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు ఎం.రవి, జూరుగ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె అజయ్‌కుమార్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్ శివాజి తదితరులు పాల్గొన్నారు.



తిరుమలలో చిక్కిన చిరుత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుమల అలిపిరి కాలినడక మార్గంలో ఈ నెల 22న బాలుడిని గాయపరిచిన చిరుత శుక్రవారం రాత్రి అటవీశాఖాధికారుల బోనుకు చిక్కింది. చిరుత ఆరోగ్యంపై జూ వెటర్నరీ అధికారులు ఇచ్చే సూచనలకు అనుగుణంగా అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ తెలిపారు. వేలాదిమంది వెళ్లే అలిపిరి నడక మార్గంలో బాలుడిపై చిరుత దాడి చేయడంతో వెంటనే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. బాలుడిని విడిచిపెట్టిన ప్రాంతంలో దాదాపు 100 ట్రాప్ కెమెరాలను, సమీప అటవీ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రెండు బోన్లను ఏర్పాటు చేశారు. దీంతో చిరుత బోనులో చిక్కింది.

ఇన్వాయిస్ ఆధారంగానే లైఫ్ ట్యాక్స్

- హైకోర్టు తీర్పు

ప్రజాశక్తి-అమరావతి

మోటారు కార్ల కొనుగోలు వేళ లైఫ్ ట్యాక్స్ (జీవితకాల పన్ను) వాహన ఇన్వాయిస్ రేటు (పన్ను లేని ధర) మేరకే ఉండాలని హైకోర్టు తేల్చింది. ఎపి మోటార్ వాహనాల పన్నుల చట్టంలోని 6వ షెడ్యూల్ ప్రకారం లైఫ్ ట్యాక్స్‌ను వాహన ధర ఆధారంగానే వసూలు చేయాలని చెప్పింది. ఇద్దరి నుంచి అధికంగా వసూలు చేసిన లైఫ్ ట్యాక్స్ మొత్తాన్ని 4 వారాల్లో వారికి చెల్లించాలని అధికారులను ఆదేశిస్తూ జస్టిస్ వి సుజాత తీర్పు చెప్పారు. హ్యుందాయ్ వెన్యూ కారుకు వాహన ధర మీద కాకుండా నికర ఇన్వాయిస్ ధర మీద 14 శాతం పన్నును (అదనంగా రూ.5,268) వసూలు చేయడాన్ని సవాల్ చేస్తూ విజయవాడకు చెందిన తలశిల సౌజన్య రిట్ దాఖలు చేశారు. ఇదే తరహాలో 2019లో తన నుంచి అదనంగా రూ.1.16 లక్షలు వసూలు చేశారని విజయవాడకు చెందిన వల్లూరు పవన్ చంద్ మరో రిట్ వేశారు. లైఫ్ ట్యాక్స్‌ను వాహన నికర ఇన్వాయిస్ ధర ఆధారంగానే వసూలు చేయాలన్న పిటిషనర్ల వాదనను ఆమోదిస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది.

శ్రీవారి దర్శనం టోకెన్లు విడుదల

ప్రజాశక్తి -తిరుమల

సెప్టెంబర్ నెలకు సంబంధించి తిరుమల శ్రీవారి రూ.300 ప్రత్యేక దర్శనం టికెట్లను శనివారం టిటిడి విడుదల చేసింది. రెండు గంటల్లోనే ఆన్‌లైన్లో టికెట్లు అమ్ముడుపోయాయి. టిటిడి అధికారిక వెబ్ సైట్.. మొబైల్ యాప్ ద్వారా మాత్రమే టికెట్లు బుక్ చేసుకోవాలని టిటిడి తెలిపింది. యాత్రికులు నకిలీ వెబ్ సైట్లను నమ్మి మోసపోవద్దని సూచించింది. ఇప్పటికే ఆర్జిత సేవా టికెట్లను విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 22న ఆర్జిత సేవా టికెట్లు, 23న అంగప్రదక్షిణం టికెట్ల కోటాను విడుదల చేసింది. సెప్టెంబర్ నెలలో శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో కూడా టికెట్లను యాత్రికులకు అందుబాటులో ఉంచారు.

సంపాదకీయం


సంఘీభావం

'మొదట వారు కమ్యూనిస్టుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను కమ్యూనిస్టును కాదు/ తర్వాత వారు సోషలిస్టుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను సోషలిస్టును కాదు/ అప్పుడు వారు ట్రేడ్ యూనియన్ వాదుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను ట్రేడ్ యూనియన్ వాది కాదు/ అప్పుడు వారు యూదుల కోసం వచ్చారు, నేను మాట్లాడలేదు/ ఎందుకంటే నేను యూదుని కాదు/ ఇప్పుడు వారు నా కోసం వచ్చారు/ నా కోసం మాట్లాడటానికి ఎవరూ లేరు' అంటాడు మార్టిన్ నీమోల్లర్. హిట్లర్‌కు గట్టి మద్దతుదారుగా వున్న నీమోల్లర్... వారి భ్రమల నుంచి బయట పడిన తర్వాత, వారికి వ్యతిరేకంగా తన స్వరాన్ని పెంచాడు. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలలో అసహనం, అన్యాయాలకు గురైన బాధితుల పక్షాన నిలిచి, వారిని సంఘటితం చేసేందుకు, వారిలో ఐక్యత పెంచేందుకు, వారికి సంఘీభావం తెలిపేందుకు పై కవితను రాశాడు. విభిన్న సంస్కృతులు, భావజాలాలు, ఆసక్తులతో వర్గీకరించబడిన సమాజంలో, సంఘీభావం సానుకూల మార్పుకు శక్తివంతమైన ఉత్ప్రేరకంగా నిలుస్తుంది. 'సంఘీభావం అనేది స్వచ్ఛందమైన పనికాదు. ఒక లక్ష్యం కోసం పోరాడే శక్తుల మధ్య పరస్పర సహాయం' అంటారు ప్రముఖ సోషలిస్ట్, మొజాంబిక్ దేశ మొదటి అధ్యక్షుడు సమోరా మాచెల్.

అసమానత, అన్యాయాలకు గురవుతున్న సమాజంలో వ్యవస్థాగత సమస్యలను ఎదుర్కోవడానికి సంఘీభావం ఒక శక్తివంతమైన ఆయుధంగా పనిచేస్తుంది. అణచివేత వ్యవస్థలు, నిరంకుశత్వం, వివక్షాపూరిత విధానాలను సవాలు చేయడానికి వ్యక్తులను, సంఘాలను ఇది ఉత్తేజపరుస్తుంది. అట్టడుగు వర్గాలకు సంఘీభావంగా నిలవడం ద్వారా సమానత్వం, న్యాయం కోరే ఐక్య వేదికలను సృష్టించవచ్చు. నిరంకుశ ధోరణులను ఎదుర్కోడానికి, అట్టడుగు వర్గాలకు న్యాయం చేయడానికి, వారి పురోగతికి అవసరమైన మార్గాలను రూపొందించడానికి బాట ఏర్పడుతుంది. నాటి వాల్‌స్ట్రీట్ ఉద్యమం నుంచి నిన్నామొన్నటి రైతు ఉద్యమం, రెజ్లర్ల ఉద్యమం వరకు నిరంకుశ విధానాలపై బిగించిన పిడికిళ్లు, గర్జించిన గళాలు ఉద్యమ కెరటాలయ్యాయి. ఒక్కరితో మొదలై... వేలాదిమందితో ఐక్యమై, సంఘటితమై సాధించిన విజయాలలో కీలకమైన విషయం. 'ఐక్యత బలమైన శక్తి : ఐక్యత లేని ప్రజలు శక్తిహీనులు' అంటాడు ఘనా దేశ మొదటి అధ్యక్షుడు, 1962లో లెనిన్ శాంతి బహుమతి గ్రహీత క్వామే న్క్రుమా.

దశాబ్దాలుగా భూమితో, ఊరితో పెనవేసుకున్న అనుబంధం. నిద్ర లేచింది మొదలు... మళ్లీ నిద్రించే వరకు ఆ పల్లెతోనే వారి బతుకు, అడవిలోనే వారి జీవన ప్రయాణం. అలాంటి బతుకు బంధాన్ని రాష్ట్ర ప్రయోజనాల కోసం త్యాగం చేసిన పల్లె తల్లి బిడ్డలు వారు. తల్లి ఒడి నుంచి బలవంతంగా నెట్టబడిన నిర్వాసితులు. శ్రీశైలం, నాగార్జునసాగర్ మొదలు... వెలుగొండ, వంశధార వరకు నిర్వాసితుల కన్నీటిగాథలన్నీ ఒక్క రీతిగానే వున్నాయి. ఇప్పుడు పోలవరం నిర్వాసితులు కూడా ఆ జాబితాలో చేరారు. కాంట్రాక్టర్లకు వేల కోట్లు కట్టబెడుతున్న ప్రభుత్వాలు... నిర్వాసితులకు మొండిచెయ్యి చూపుతున్నాయి. కలలను, ఆశలను కలబోసి కట్టుకున్న సొంత ఇంటిని వదిలేలాచేసి... నిర్వాసితులుగా మార్చారు. కట్టెలు, తేనె, వెదురు, కూరగాయలు, పుట్టగొడుగులతో అమ్మలా ఆదుకుని బువ్వెట్టిన అడవితల్లికి దూరమై, సమీప పొలాల్లోకి వ్యవసాయ కూలీలుగా విసిరేయబడినోళ్లు కొందరైతే, పరిహారం కోసం ఎదురుచూస్తూ.. సొంతవూళ్లలోనే బిక్కుబిక్కుమంటున్నోళ్లు ఇంకొందరు. 'అట్టడుగున పడి కనిపించని/ కథలన్నీ కావాలిప్పుడు/ దాచేస్తే దాగని సత్యం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. ఎవరికీ పట్టని నిర్వాసితుల కన్నీటి కథలన్నీ వెలుగులోకి తేవాలని, న్యాయం కోసం ఎదురుచూస్తున్న పోలవరం నిర్వాసితులకు తగిన పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాలను నిలదీస్తున్నది పోరుకేక. రోడ్డున పడిన నిర్వాసితులకు సంఘీభావంగా మొదలైంది పోరుయాత్ర. ఎరుపెక్కిన నిర్వాసితుల కన్నీళ్లు ప్రశ్నిస్తున్నాయి మా వెనుక మీరుండరా? అని. సంఘటితమై... సమైక్యమై... నేను సైతం అంటూ అడుగు వేద్దాం. మొదటి అడుగు ఒంటరే కావొచ్చు... నీ వెనుక వచ్చేవారికది బాట అవుతుంది.


మహనీయుల మాట



ప్రపంచం మారాలని మనం కోరుకోవడం కాదు. మార్పు మనతో మొదలైతే... ప్రపంచం అదే మారుతుంది.
- లియో టాల్‌స్టాయ్

'అప్రకటిత' ఎమర్జెన్సీపై ఐక్య పోరాటం

విశ్లేషణ



తెలకపల్లి రవి

పాట్నాలో జయప్రదంగా ముగిసిన 17 ప్రతిపక్షాల శిఖరాగ్ర సమావేశం దేశ రాజకీయాలలో అందులోనూ లోక్‌సభ ఎన్నికల ముంగిట్లో కీలక ఘటన అని చెప్పొచ్చు. దీని కొనసాగింపుగా సిమ్లాలో తదుపరి సమావేశం జరపాలని హాజరైన నేతలు నిర్ణయించారు. అంటే ఈ ప్రక్రియను కొనసాగించాలని కూడా వారు ఏకాభిప్రాయానికి వచ్చారు. 450 నియోజక వర్గాలలో బిజెపికి వ్యతిరేకంగా ఒకే అభ్యర్థిని ప్రతిపక్షాల తరపున నిలబెట్టాలని భావిస్తున్నట్టు సమావేశానికి ముందు వార్తలు వచ్చాయి. వివిధ రాష్ట్రాలలో పోటీలు ఎలా వుంటాయనే అంశాన్ని వచ్చే సమావేశంలో చర్చించాలని కూడా అంగీకారానికి వచ్చాయి. బిజెపి తర్వాత పెద్ద పార్టీగా వున్న కాంగ్రెస్ నుంచి రాష్ట్రాలను పాలించే ప్రాంతీయ పార్టీల వరకూ ఈ సమావేశానికి హాజరైనాయి. ముగ్గురు ముఖ్యమంత్రులు స్వయంగా పాల్గొనగా కాంగ్రెస్, సిపిఎం అగ్రనేతలు హాజరవడంతో దేశంలో దాదాపు గణనీయమైన భూభాగానికి, రాజకీయ బలానికి ప్రాతినిధ్యం లభించినట్లయింది. అలా అని హడావుడిగా ఏదో ఒక ప్రకటన చేసి ప్రచారంలో పెట్టడం గాక హాజరైన పార్టీలు తమ తమ అభిప్రాయాలు సూటిగా చెప్పడం ఆచరణయోగ్యం కాని అభిప్రాయాలను ముందే తోసిపుచ్చడం మంచి విషయమే. ఉదాహరణకు కాంగ్రెస్ పెద్దన్న పాత్ర వహించాలనే కొందరి మాట, లేదంటే ఎక్కడ ఎవరు బలంగా వుంటే వారి మాట అందరూ వినాలనే వాదన ఇక్కడ రాలేదు. బిజెపి కాంగ్రెస్‌లను ఒకే గాట కట్టే ధోరణి కూడా కనిపించలేదు. అదే సమయంలో కాంగ్రెస్ పట్ల తమకున్న అభ్యంతరాలనూ మిగిలిన పార్టీలు దాచిపెట్టుకోలేదు. ఏది ఏమైనా మతతత్వ రాజకీయాలు, రాష్ట్రాలపై దాడి, జాతీయ రాజ్యాంగ సంస్థల దుర్వినియోగంతో విపక్షాలపై దాడి, భావ ప్రకటనా స్వేచ్ఛ పరిరక్షణ వంటి అంశాలు కీలకమనే అవగాహన అక్కడ ద్యోతకమవడం హర్షణీయం.

బీహార్ ఉద్యమం-ఎమర్జెన్సీ

ఇప్పటి సమావేశాన్ని కాసేపు పక్కనపెట్టి గత చరిత్ర లోకి తొంగిచూస్తే బీహార్ రాజధాని పాట్నా లేదా పాతకాలపు పాటలీపుత్ర ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటాన్ని గుర్తు చేస్తుంది. యాభై ఏళ్ల కిందట జయప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో ఇక్కడే ప్రతిపక్షాల ఐక్య పోరాటం మొదలవడం, అది విస్తరించిన కొద్దీ ప్రతిస్పందనగా ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ విధించడం ప్రజాస్వామ్య చరిత్రలో ఒక పీడకల. పౌరహక్కులు కాలరాచి, ప్రభుత్వాలను కూలదోసి పత్రికలపై సెన్సార్‌షిప్ విధించి ప్రతిపక్ష నాయకులను ఖైదు చేసిన ఆ రోజులు ఎన్నటికీ మర్చిపోకూడనివి. అందుకు వ్యతిరేకంగా జయప్రకాశ్ నాయకత్వంలోనే ప్రతిపక్షాలు ఏకమై జనతా పార్టీగా ఏర్పడ్డాయి. అయితే అందులో చోటు సంపాదించిన నాటి జనసంఘం మతతత్వ పోకడలు జనతా ప్రభుత్వ విచ్ఛిన్నానికి దారితీశాయి. ఆ జనసంఘమే బిజెపిగా అవతరించి సర్వ ప్రతిపక్షాల ఐక్యత మంత్రంతో పెరుగుతూ 1990లో వచ్చిన వి.పి.సింగ్ నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని కూలదోసింది. అప్పుడు కూడా అద్వానీ రథయాత్రను బీహార్ లోనే అడ్డుకోవడం యాదృచ్ఛికం కాదు. ఈ క్రమం 1992 అయోధ్య బాబ్రీ విధ్వంసం వరకూ నడిచి దేశ రాజకీయాలలో మతతత్వం పరాకాష్టకు చేర్చింది. 1996లో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ కూటమిని కూడా బిజెపి, కాంగ్రెస్ కూలదోశాయి. 1996 నుంచి 2004 వరకూ వాజ్‌పేయి ప్రభుత్వం పాలన సాగడానికి టిడిపి, జెడియు వంటి పార్టీల ఫిరాయింపు కారణమైంది. 2004లో వామపక్షాల మద్దతుతో యుపిఎ1 ఏర్పడినా అమెరికా అణు ఒప్పందానికి వ్యతిరేకంగా అవి వ్యతిరేకించాక ఫిరాయింపుల సహాయంతో 2013 దాకా పాలన సాగించింది. కాని 1991లో మొదలైన సరళీకరణ విధానాలు ఒకవైపు, బిజెపి రగిలించిన మత రాజకీయాలు మరోవైపు దేశ రాజకీయ దృశ్యాన్ని కకావికలు చేశాయి. 2014 నుంచి పాలన లోకి వచ్చిన మోడీ ప్రభుత్వం దీన్ని పరాకాష్టకు చేర్చింది. ఆయన పాలనలో మతతత్వం నిరంకుశత్వం కలయికలో ఈ ప్రభుత్వ పాలన అప్రకటిత ఎమర్జెన్సీగా పేరు తెచ్చుకుంది. అప్పటికంటే దారుణంగా పత్రికల పీకనొక్కడం, స్వేచ్ఛను హరించడం మత శక్తుల విజృంభణ, అమెరికాకు దాసోహమనడం, యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టడం... ఒకటేమిటి ఫాసిస్టు తరహా పోకడలతో సంఘ పరివార్ అనబడే ఆర్‌ఎస్‌ఎస్ కూటమి రెచ్చిపోతున్నది. సుప్రీంకోర్టుతో సహా దేశంలోని అన్ని రాజ్యాంగ వ్యవస్థలూ ఒత్తిడికి లోనవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాలను నామకార్థంగా మార్చి మోడీ ప్రధాని కార్యాలయమే ఏకైక శాసన కేంద్రంగా మారింది. ఈ పరిస్థితుల కారణంగానే లౌకిక ప్రతిపక్షాలు మళ్లీ ఒక తాటి మీదకు రావలసిన అగత్యమేర్పడింది. మొత్తానికి పాట్నా మరోసారి ప్రతిపక్ష ఐక్యతకు కేంద్రమైంది. విశేషమేమంటే ఈ యాభై ఏళ్లలోనూ భాగస్వాములుగా తప్ప నేరుగా కాంగ్రెస్, బిజెపిలు ఇక్కడ దాదాపు అధికారంలోకి రాలేకపోయాయి.



ఇలాంటి ముందస్తు చర్చలు, ఉమ్మడి అవగాహన ఆ క్రమాన్ని సులభతరం చేస్తాయి. అంతకు మించి లౌకిక ప్రజాస్వామ్య రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలనే చైతన్యాన్ని పెంచుతాయి. అవకాశవాద శక్తులను, బిజెపికి అనుబంధ శక్తులుగా వ్యవహరిస్తున్న వారిని ప్రజల ముందు నిలబెడతాయి. ఒకే దేశం-ఒకే మతం-ఒకే పార్టీ-ఒకే మోడీ అనే ఏకపక్ష నిరంకుశత్వాన్ని ఓడించే కర్తవ్యానికి ప్రజలను సిద్ధం చేస్తాయి. ఈ ఐక్యతా కృషిని అపహాస్యం చేసే వారి కుటిల ప్రచారాలను బేఖాతరు చేస్తూ ఈ కర్తవ్యాన్ని జయప్రదం చేసేట్టయితే అది దేశ చరిత్రలో మరో చారిత్రక మలుపుగా నిలిచిపోతుంది.

వివిధ పార్టీల సంకేతాలు

బిజెపిని ఓడించడమే ఏకైక లక్ష్యంగా వుండాలని సమావేశానికి హాజరైన సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. వివిధ రాష్ట్రాలలో పరిస్థితులను బట్టి చర్చలు జరగాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ అన్నారు. ఢిల్లీ ఆర్డినెన్సును కాంగ్రెస్ వ్యతిరేకిస్తేనే దాంతో తాము ప్రతిపక్ష వేదికలో వుంటామని ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఈ విధంగా షరతులు పెట్టడం సరికాదనే అభిప్రాయం కాంగ్రెస్ వ్యక్తం చేసింది. బెంగాల్‌లో కాంగ్రెస్ సిపిఎంతో కలవకుండా వుంటేనే తాము పాలుపంచుకుంటామని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ షరతు పెట్టారు. అయితే మళ్లీ బిజెపి గెలిస్తే ఎన్నికలు జరిగే అవకాశం కూడా వుండదని ఆమె అన్నారు. తాము బిజెపి వ్యతిరేకం తప్ప కాంగ్రెస్ వ్యతిరేకులుగా పరిగణించరాదని సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేష్ యాదవ్ వెల్లడించారు. బిజెపితో ఒకసారి కూడా కలవని ఆర్‌జెడి వ్యవస్థాపక నేత లాలూ ప్రసాద్ యాదవ్ ఈ సమావేశంలో ఒక ఆకర్షణ అయితే వారితో కలసి చేతులు కాల్చుకున్న నితీష్ కుమార్ అతిథేయ పాత్ర పోషించారు. సిపిఐ డి.రాజా కూడా అదే సందేశమిచ్చారు. శివసేన నాయకులూ దేశం ముందున్న ప్రమాదాన్ని గుర్తుచేశారు. ఈ విధంగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనా బిజెపి నిరంకుశత్వాన్ని ఓడించాల్సిన అవసరాన్ని అందరూ గుర్తించడం పెద్ద మలుపు. సిమ్లా సమావేశంలో ఇది మరింత ముందుకు సాగి మరింత స్పష్టమైన కార్యాచరణకు దారితీస్తుందని ఆశించవచ్చు.

గతంలో బిజెపితో చేతులు కలిపి ఈ పరిస్థితికి దోహదం చేసిన కొన్ని పార్టీలూ ఇప్పుడు ఇందులో పాల్గొనగా టిడిపి, బిజెడి వంటి పార్టీలు ఇప్పటికీ కళ్లు తెరవని స్థితి. ఇక ఎ.పి ని పాలించే వైసిపి బిజెపి కేంద్ర ప్రభుత్వానికి విధేయ పక్షంగా వత్తాసునిస్తుంటే తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ బిఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్, బిజెపిలకు ప్రత్యామ్నాయ విధానాలు కీలకమంటున్నారు గనక బిఎస్‌పితో సహా వీరందరికీ ఆహ్వానాలు పంపలేదు. గతంలో బెంగాల్ బీహార్, యు.పి లతో పాటు ప్రతిపక్ష కూటమికి ఒక ముఖ్య కూడలిగా ఉమ్మడి ఎ.పి వుండిన పరిస్థితి ఇప్పుడు లేదు. బిజెపిపై తీవ్రంగా విమర్శలు కార్యక్రమాలు చేసిన బిఆర్‌ఎస్ భవిష్యత్ వ్యూహమేమిటో అస్పష్టం. ఈ ఐక్యవేదికలు, కూటములతో ప్రయోజనం లేదని కెటిఆర్ ప్రకటించారు.

బిజెపి అక్కసు

ఇక బిజెపి సమావేశాన్ని జీర్ణం చేసుకోలేకపోవడమే గాక వేయి రకాల దాడిచేసింది. పాట్నా గోడలను వ్యతిరేక పోస్టర్లతో కార్టూన్లతో నింపేసింది. మిమ్మల్ని అరెస్టు చేసిన కాంగ్రెస్‌తో కలుస్తారా అని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేసింది. ప్రతిపక్షాలతో సమావేశానికి హాజరవడం ద్వారా కాంగ్రెస్ తను గెలవలేనని ఒప్పుకుందని అతి తెలివితో వాదించింది. ప్రజాస్వామ్యంలో పొత్తులు, సర్దుబాట్లు అపరాధమో అవమానమో కాదు. కాకుంటే భావసారూప్యత, ప్రజాస్వామ్య ప్రయోజనాలు ఉమ్మడి ప్రమాదంపై అవగాహన వుండాలి. ఆ మాటకొస్తే మోడీ ప్రభుత్వం కూడా పొత్తులు లేకుండా పోటీ చేసి ఏర్పడిందా? వంటరిగా మెజార్టీ వుండొచ్చు గాని ఎన్నికల్లో కలిసే పోరాడింది కదా. గుజరాత్, యు.పి వంటి వాటిని మినహాయిస్తే మరెక్కడా బిజెపి కేవలం తన బలంతోనే గెలిచింది లేదు. ఫిరాయింపులు, మిశ్రమ కూటములతోనే పాలిస్తున్నది. పరోక్షంగానూ ఒత్తిళ్లతో ప్రలోభాలతో బెదిరింపులతో కొన్ని పార్టీలను లోబర్చుకున్నది. ఈ అక్రమ పొత్తులకన్నా సూటిగా రాజకీయంగా అవగాహనకు రావడం రాజ్యాంగ బద్ధం.

రేపటి పోరాటానికి సిద్ధంగా..

రెండు కారణాల వల్ల ఈ సమావేశాలు లౌకిక పక్షాల అవగాహన త్వరితంగా పూర్తి కావలసి వుంది. లోక్‌సభకు ఎన్నికలు ముందుగా రావచ్చని బిజెపి కావాలనే సంకేతాలిస్తున్నది. నిజంగా వచ్చేట్టయితే సిద్ధం కావలసి వుంటుంది. ఎన్నికలు ఎప్పుడు జరిగినా ముందే అవగాహన వుందన్న సంకేతాలు స్పష్టం చేస్తేనే ఫలితాల తర్వాత కలసి వ్యవహరించే చట్టబద్ధ అనుకూలత వుంటుంది. ఎందుకంటే పూర్తి మెజార్టీ గల పార్టీ లేదా ఎన్నికలు ముందు ఏర్పడిన కూటమికి మొదటి అవకాశం, ఎన్నికల తర్వాత ఏర్పడినా పూర్తి మెజార్టీ గల కూటమి ఈ క్రమంలో అవకాశం ఇవ్వాలని గతంలో కొన్ని స్థూలమైన సూచనలు వచ్చాయి. సిపిఎం ఎప్పుడూ చెబుతున్నట్టు భిన్నమైన పరిస్థితులు, రాజకీయ శక్తులు వున్న ఈ దేశంలో ఎన్నికల ముందే సంపూర్ణమైన అవగాహనకు రావడం, కాబోయే ప్రధాని ఎవరో నిర్ణయించుకోవడం జరగని పని. గతంలో జరగలేదు కూడా. అది ఎన్నికల అనంతర (పోస్ట్ పోల్) ప్రక్రియగానే వుంటుంది. అయితే ఇలాంటి ముందస్తు చర్చలు, ఉమ్మడి అవగాహన ఆ క్రమాన్ని సులభతరం చేస్తాయి. అంతకు మించి లౌకిక ప్రజాస్వామ్య రక్షణ కోసం ఐక్యంగా పోరాడాలనే చైతన్యాన్ని పెంచుతాయి. అవకాశవాద శక్తులను, బిజెపికి అనుబంధ శక్తులుగా వ్యవహరిస్తున్న వారిని ప్రజల ముందు నిలబెడతాయి. ఒకే దేశం-ఒకే మతం-ఒకే పార్టీ-ఒకే మోడీ అనే ఏకపక్ష నిరంకుశత్వాన్ని ఓడించే కర్తవ్యానికి ప్రజలను సిద్ధం చేస్తాయి. ఈ ఐక్యతా కృషిని అపహాస్యం చేసే వారి కుటిల ప్రచారాలను బేఖాతరు చేస్తూ ఈ కర్తవ్యాన్ని జయప్రదం చేసేట్టయితే అది దేశ చరిత్రలో మరో చారిత్రక మలుపుగా నిలిచిపోతుంది.

కార్పొరేట్ల కోసమే... 'బ్లూ ఎకానమీ పాలసీ'


అభిప్రాయం

డా॥ సి.ఎన్. క్షేత్రపాల్ రెడ్డి

అభివృద్ధి ప్రధానాశయంగా పేర్కొంటున్న 'బ్లూ ఎకానమీ పాలసీ' అందమైన అబద్ధం. అత్యంత పేద వర్గాలైన మత్స్యకారుల జీవనోపాధి దెబ్బ తీయడంతో పాటు వారిని వారి నివాసాలకు దూరం చేసే కుట్ర. ఇప్పటికే 'సాగర మాల' పేరుతో చేపట్టిన ప్రాజెక్టుకు సంబంధించిన కార్యకలాపాలతో మత్స్యకారుల జీవన విధానంలో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో సముద్రాన్నే నమ్ముకుని జీవిస్తున్న లక్షలాదిమంది మత్స్యకార కుటుంబాలను వారి జీవనోపాధికి దూరం చేసి, వారి ఆవాసాలను బడా కార్పొరేట్ శక్తులకు అప్పగించేందుకే కేంద్ర ప్రభుత్వం కొత్తగా 'బ్లూ ఎకానమీ పాలసీ'ని ముందుకు తెచ్చింది. సముద్ర జలాల పరిరక్షణ, పర్యావరణం, సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్న ప్రజల రక్షణకు సంబంధించిన అంశాలేవీ లేకుండానే దేశంలోని సముద్ర తీరాన్ని, సముద్ర సంపదల్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్‌లకు అప్పగించేందుకు కేంద్రం పావులు కదుపుతోంది. కార్పొరేట్ల సేవే లక్ష్యంగా పని చేస్తోంది.

ప్రపంచ వాణిజ్యంలో 80 శాతం సముద్రాల నుంచే జరుగుతుంది. ప్రపంచ జనాభాలో 40 శాతం మంది ప్రజలు తీర ప్రాంతాలకు సమీపంలోనే నివసిస్తున్నారు. భారతదేశం విస్తారమైన, వైవిధ్యమైన సముద్ర భూభాగాన్ని కలిగి ఉంది. అరేబియా సముద్రం, బంగాళా ఖాతం వెంబడి కీలకమైన వివిధ ఓడరేవు నగరాలున్నాయి. మొత్తం 8,118 కి.మీ పొడవైన తీరప్రాంతం ఉంది. ప్రతి ఏటా దాదాపు 4.412 మెట్రిక్ టన్నుల చేపలు సముద్రం నుంచి ఉత్పత్తి అవుతున్నాయనే అంచనాలున్నాయి. దాదాపు 4 కోట్ల మంది ప్రజలు సముద్ర చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి ఏటా రూ.65 వేల కోట్ల మేర వ్యాపారం జరుగుతున్నట్టు లెక్కలు చెబుతున్నాయి. దేశంలోని ఎగుమతుల విషయానికి వస్తే మత్స్య సంపద వాటా గణనీయమైనది.

వీటన్నిటిని గమనంలోకి తీసుకున్న కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇంతటి ఆర్థిక పరిపుష్టి కలిగిన సముద్ర తీర ప్రాంతాన్ని, సముద్ర సంపదల్ని తన అనుంగు కార్పోరేట్లకు కట్టబెట్టడానికి కావలసిన ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే 'సాగర మాల' ప్రాజెక్ట్ రూపకల్పన జరిగింది. ఇది చాలదన్నట్టు తాజాగా 'బ్లూ ఎకానమీ పాలసీ'ని ముందుకు తెచ్చింది. ప్రపంచంలోనే అతి పెద్ద తీర ప్రాంత దేశమైన భారత్‌లో అందమైన బీచ్‌లు, తీర ప్రాంతాలకు రవాణా సౌకర్యాల మెరుగు, ఓడరేవుల ఆధునీకరణ, స్థిరమైన ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, సముద్ర కాలుష్య నివారణ, సముద్ర వనరుల సక్రమ వినియోగం వంటి అందమైన, మోసపూరితమైన అంశాలను ముందు పెట్టి 'బ్లూ ఎకానమీ పాలసీ' దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధికి మద్దతుగా నిలుస్తుందని పేర్కొంటోంది. దేశంలోని తొమ్మిది తీర ప్రాంత రాష్ట్రాల్లోని 12 మేజర్ పోర్టులు, 200 చిన్న పోర్టులకు రవాణా సౌకర్యాల కల్పన ద్వారా వ్యాపారాన్ని పెంచాలనేది ఇందులో ప్రధానాంశం. షిప్పింగ్ పరిశ్రమ విస్తరణ ద్వారా కార్పోరేట్ శక్తులకు మరింత లాభం చేకూర్చాలని చూస్తోంది. ఆఫ్ షోర్ ఎనర్జీ ప్రొడక్షన్‌ను ప్రోత్సహించడం, ఇంధన అవసరాలను తీర్చడం అనే పేరుతో ఆయా విభాగాల్ని పూర్తిగా ప్రైవేటు శక్తులకు కట్టబెట్టాలని చూడడం మరో అంశంగా కనిపిస్తోంది. మెరైన్ బయో టెక్నాలజీ, మైనింగ్‌ల పేరుతో సముద్రం లోని ఇసుక, ఇతర ఖనిజ సంపదలపై కార్పొరేట్ శక్తులకు గుత్తాధిపత్యం కట్టబెట్టడం ఇంకో అంశం.



సముద్ర తీర ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన మౌలిక సదుపాయాలు లేవు. అనేక పోర్టులు, విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందనే సత్యాన్ని దాచి 'బ్లూ ఎకానమీ' ద్వారా ఆర్థిక కార్యకలాపాలను అభివృద్ధి చేస్తామనడం అతిశయోక్తి అవుతుంది. లాభాల కోసం పని చేసే సంస్థలకు సముద్ర ప్రాంతాల్ని అప్పగించడం ద్వారా మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోతారు. విపరీతమైన పర్యావరణ నష్టం వాటిల్లుతుంది.

అయితే ప్రభుత్వం మాత్రం ఈ పాలసీ మొత్తం అభివృద్ధి కోసమే అంటోంది. ఇందుకోసం ఆ పాలసీ ముసాయిదాలో చెబుతున్న అంశాలేవీ ఆచరణకు నిలుస్తాయనడానికి తగిన చర్యలు ఉండడం లేదు. సముద్ర తీర ప్రాంతాల్లో ఇప్పటికీ సరైన మౌలిక సదుపాయాలు లేవు. అనేక పోర్టులు, విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల కొరత ఉందనే సత్యాన్ని దాచి 'బ్లూ ఎకానమీ' ద్వారా ఆర్థిక కార్యకలాపాలను అభివృద్ధి చేస్తామనడం అతిశయోక్తి అవుతుంది. లాభాల కోసం పని చేసే సంస్థలకు సముద్ర ప్రాంతాల్ని అప్పగించడం ద్వారా మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోతారు. విపరీతమైన పర్యావరణ నష్టం వాటిల్లుతుంది. సముద్రంతో ఇప్పటికే ఓవర్ ఫిషింగ్ అనేది ఒక పెద్ద సవాలుగా ఉంది. సాంప్రదాయ మత్స్యకారుల పాలిట ఇది శాపంగా మారుతోంది. హై సీస్ లో అంతర్జాతీయ సంస్థలకు చేపలు పట్టుకునేందుకు అవకాశం కల్పించడంతో క్రమంగా ప్రపంచానికి ఫుడ్ బాస్కెట్‌గా పిలువబడే సముద్ర జలాల్లో చేపల నిల్వలు క్షీణించి సముద్ర పర్యావరణ వ్యవస్థకే పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. ఇది తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని చూపుతుంది. సముద్రాలు వ్యాపార కేంద్రాలుగా మారడంతో విపరీతమైన ఎగుమతులు, దిగుమతుల కారణంగా, సముద్రంపై ఇంధన రవాణా మూలంగా చమురు చిందటం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పారిశ్రామిక వ్యర్థాలతో కాలుష్యం పెరుగుతుంది. ఇక డీప్ శాండ్ మైనింగ్ కారణంగా సముద్ర పర్యావరణ వ్యవస్థలకు హాని కలిగిస్తుంది. వాతావరణంలో విపరీతమైన మార్పులు పెరిగి తీరప్రాంతాల్లో తీవ్ర నష్టం జరుగుతుంది.

మరో కీలకమైన అంశం విషయానికి వస్తే ఎంతో కాలంగా భారతదేశం, శ్రీలంకల మధ్య ఫిషింగ్ వివాదం నడుస్తూనే ఉంది. ఇరు దేశాల సముద్ర జలాల మధ్య సరిహద్దు స్పష్టంగా విభజించబడలేదు. ఇది రెండు దేశాల మత్స్యకారుల మధ్య గందరగోళానికి, సంఘర్షణకు దారితీస్తూనే ఉంది. దీనికి 'బ్లూ ఎకానమీ పాలసీ' పరిష్కారం చూపించలేదు.

సస్టైనబిలిటీ సైన్స్ జర్నల్ తన సంపాదకీయంలో బ్లూ ఎకానమీపై కీలకమైన వ్యాఖ్య చేసింది. బ్లూ ఎకానమీకి సరైన నిర్వచనం లేదని పేర్కొంది. ఈ అసంబద్ధత కారణంగా ఈ పాలసీని రూపొందించి అమలు చేసే వారి అభిరుచులను బట్టి ఎంపిక చేసుకున్న లక్ష్యాలు తారుమారవుతాయని హెచ్చరించింది. మరో అంతర్జాతీయ పరిశోధన సంస్థ దీన్ని మత్స్యకారుల పాలిట విషాదకరమైన పాలసీగా పేర్కొంది. మత్స్యకారులు సముద్రాన్ని చాలా స్థిరమైన పద్ధతుల్లో ఉపయోగిస్తారని, అయితే బ్లూ ఎకానమీ పాలసీ ఇందుకు విరుద్ధమైనదని తెలిపింది. ఈ పాలసీ సముద్రాన్ని లాభదాయకమైన వనరుగానే పరిగణిస్తుందని పేర్కొంది. తీర ప్రాంత పర్యావరణ వ్యవస్థలు విధ్వంసం అవుతాయని వెల్లడించింది.

ఈ నేపథ్యంలో ఏ దేశమైనా తన సముద్ర సంపదను కేవలం ఆర్థిక వనరుగానే చూడకూడదని గ్రహించాలి. సామాజిక, సాంస్కృతిక, పర్యావరణ కోణంలోనూ చూడాల్సి ఉంటుంది. కేవలం కార్పొరేట్ల కోసం వ్యాపార కాంక్షతో...లక్షలాది మంది మత్స్యకారుల కడుపు కొట్టేలా రూపొందించిన బ్లూ ఎకానమీ పాలసీని రద్దు చేయాలి. సముద్ర తీరప్రాంతాల్లో పర్యావరణానికి హాని కలుగకుండా స్థిరమైన అభివృద్ధి కోసం అన్ని రంగాల నిపుణులతో సంప్రదింపులు జరిపి సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి.

(వ్యాసకర్త సెల్ : 9059837847)

కవిత్వం

దిల్ కి బాత్

చాయ్‌తో మొదలైన ప్రభుత్వం ఆవు దగ్గర ఆగిపొయ్యింది
వికాసమనే తల్లి దారి తప్పి, ఎక్కడో ఆగమయ్యింది
అమ్మాయిలు భావోద్వేగాలు తింటున్నారు
అబ్బాయిలు మోసపు కలలు తింటున్నారు
ఉద్యోగులు లంచం తింటున్నారు
నేతలు కరెన్సీ తింటున్నారు
రైతులు విషం తింటున్నారు
ఉద్యమకారులు బుల్లెట్లు తింటున్నారు..
అందరూ ఏదో ఒకటి సుష్టుగా తింటూనే ఉన్నారు.
ఎవరంటారు భారత్ ఆకలితో అలమటిస్తోందని?
చాయ్‌వాలా ప్రధానమంత్రయ్యాడు
పన్నెండు చదివినమ్మ విద్యామంత్రయ్యింది
గోచీ సన్నాసులంతా మంత్రులయ్యారు
వేలి ముద్రగాళ్ళు ఎమ్మెల్యేలయ్యారు
డిగ్రీలు, పిజీలు చేసిన వారు ఫేస్‌బుక్, వాట్సప్‌ల్లో ఇరుక్కున్నారు
ఒంటరిగా ఉన్నవాడు వ్యవస్థల్ని ముక్కలు చేస్తున్నాడు
వివాహితుడు మార్కెట్ నుంచి కూరలు మోస్తున్నాడు
వినేవాళ్ళకే కదా ఎవరైనా చెవుల్లో పూలు పెడతారు?
తెలివిగల జపానువాళ్ళు బుల్లెట్ ట్రైన్ నడుపుతారు
ఇండియా మేధావులు పదకొండు మందికి ఓం నమశ్శివాయ పంపుతారు
దాంతో ఫ్రీ బాలెన్స్ చమత్కారం జరుగుతుందని ఆశపడతారు
పంపకపోతే నిజంగానే విపత్తేదో సంభవిస్తుందని ఝడుస్తారు
అగర్‌బత్తులు రెండు రకాలుగా ఉంటాయి
ఒకటి భగవంతుడికి మరొకటి దోమలకు
భగవంతుడు వచ్చేది లేదు. దోమలు పోయేది లేదు
ఉన్నవి ఖాళీ కడుపులు, యోగా చెయ్యమంటారు
జేబులో చిల్లిగవ్వ ఉండదు, బ్యాంక్ ఎకౌంట్ తెరవమంటారు
ఉండడానికి ఇల్లు లేదురా నాయనా అంటే
మరగుదొడ్లు కట్టిస్తామంటారు
ఊళ్ళో కరెంటు ఉండదు, డిజిటల్ ఇండియా అయిపోయిందంటారు
దొరికేవన్నీ విదేశీ కంపెనీల వస్తువులు
దాన్నే 'మేకిన్ ఇండియా' అనమంటారు
పప్పు, ఉప్పు, బియ్యం జనం కొనలేకపోతున్నారు
టాటా కార్లేమో అగ్గువైపోయాయంటున్నారు
మెదడ్లో జాతి మతాల ద్వేషం నింపుతారు
స్వచ్ఛ భారత్ అభియాన్-గూర్చి గొప్పగా చెవుతారు
అసమాన్యుడి 'మన్ కి బాత్'లో.. ఏదీ వినిపించలేదు
సామాన్యుడి దిల్ కీ బాత్ ?

- డా॥ దేవరాజు మహారాజు
కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, జీవశాస్త్రవేత్త

మణిపూర్‌లో శాంతి పునరుద్ధరించండి

- జంతర్ మంతర్ వద్ద 40 సంస్థల ఆందోళన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో, ఇంఫాల్ :
మణిపూర్ వివాదాన్ని నియంత్రించి శాంతిని పునరుద్ధరించేందుకు కేంద్రప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళా సంఘాలతో సహా నలభై సంస్థలు పిలుపునిచ్చిన ఆందోళనలో అల్లర్ల బాధితులతో సహా వందలాది మంది భాగస్వాములయ్యారు. బిజెపి ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు హోరెత్తించారు. ముఖ్యమంత్రిని తొలగించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. అల్లర్ల బాధితులు ఎదుర్కొన్న క్రూరమైన అనుభవాలను కూడా వివరించారు. ఐద్వా అధ్యక్షులు పికె శ్రీమతి టీచర్ ఆందోళననుద్దేశించి మాట్లాడారు. మణిపూర్‌లో శాంతిభద్రతల పునరుద్ధరణకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపురిలు భారతదేశంలో భాగమని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారు హింసకు గురవుతున్నారని శ్రీమతి టీచర్ అన్నారు. ఐద్వా నాయకులు సుభాషిణి అలీ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్ లీడర్ అన్నీ రాజా, మహిళా హక్కుల కార్యకర్తలు పాల్గొని సంఘీభావం తెలిపారు. మరోవైపు మణిపూర్‌లోని ప్రతిపక్ష పార్టీల ఆధ్వర్యాన మహాత్మాగాంధీ స్మారక మందిరం రాజ్‌ఘాట్ వద్ద శాంతి పునరుద్ధరణ పిలుపుతో సత్యాగ్రహం జరిగింది. కాంగ్రెస్, సిపిఎం, సిపిఐ, ఆప్ సహా పది పార్టీలు పాల్గొన్నాయి.


ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐద్వా అధ్యక్షురాలు పికె శ్రీమతి టీచర్

మంత్రి గోడౌన్‌కు నిప్పు
తూర్పు ఇంఫాల్‌లో ఘటన
మణిపూర్‌లో ఇంకా అదుపులోకి రాని పరిస్థితులు

మణిపూర్‌లో అధికార బిజెపి నాయకులే లక్ష్యంగా నిరసనకారులు చేస్తున్న దాడులు ఆగటం లేదు. ప్రస్తుతం ఇదే పరిస్థితి ఆ రాష్ట్ర ప్రజారోగ్య ఇంజినీరింగ్, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ఎల్. సుసింద్రో మెయిటీకి ఎదురైంది. మంత్రికి చెందిన రెండు ప్రయివేటు గోడౌన్‌లకు మూక నిప్పు పెట్టింది. తూర్పు ఇంఫాల్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నది. ఇటు జిల్లాలోని ఖురాయ్ ప్రాంతంలో బిజెపి నాయకుడి ఇంటికి కూడా నిప్పు పెట్టే ప్రయత్నమూ జరిగింది. భద్రతా బలగాలు దానిని నిరోధించాయి. మూకను చెదరగొట్టడానికి అనేక రౌండ్ల టియర్ గ్యాస్ షెల్స్‌ను ప్రయోగించాయి. మణిపూర్‌లో పరిస్థితిపై చర్చించటానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా అఖిలపక్ష సమావేశం నిర్వహించిన ముందు రోజే.. మంత్రి ఆస్థులపై దాడి ఘటన చోటు చేసుకోవటం గమనార్హం.

మణిపూర్‌లో ఇప్పటికే పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల ఇళ్లపై ఆగ్రహంతో ఉన్న మూకలు దాడులు జరిపాయి. ఇందులో కేంద్ర మంత్రి ఆర్‌కె రంజన్ సింగ్, రాష్ట్ర మంత్రులు నెమ్చా కిప్‌గెన్, గోవిందాస్ కొంతౌజమ్, ఎమ్మెల్యేలు రఘుమణి సింగ్, రంజిత్ సింగ్, ఎస్ కెబి దేవి ఇళ్లు, ఆస్థులు ఉన్నాయి. రాష్ట్రంలోని హింసాత్మక పరిస్థితులకు బిజెపి వైఖరే కారణమని అక్కడి ప్రజల్లో, నిరసనకారుల్లో ఉన్నది.



ప్రజాస్వామ్య సూచీలో అట్టడుగున భారత్

- మార్పు చేయించేందుకు కేంద్రం రహస్య యత్నాలు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ హయాంలో "క్షీణిస్తున్న ప్రజాస్వామ్యం" స్థాయికి భారత్ ప్రతిష్ట దిగజారిన సిగ్గుచేటైన విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దాచిపెట్టింది. ఈ విషయాన్ని కప్పిపుచ్చుకునేందుకు సీనియర్ అధికారుల నాయకత్వంలో ఇప్పటికే అండర్ కవర్ ఆపరేషన్లు ప్రారంభమయ్యాయని గార్డియన్ పత్రిక పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పర్యటన సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. లండన్ ప్రధాన కేంద్రంగా పనిచేసే 'ది ఎకనామిస్ట్' ఇంటెలిజెన్స్ విభాగం ప్రపంచ దేశాల్లో ప్రజాస్వామ్య సూచికను రూపొందించింది. ఆ సూచికలో, వరుసగా మూడేళ్ల నుండి భారత్‌ను 'క్షీణిస్తున్న ప్రజాస్వామ్య' దేశంగా వర్గీకరించినట్లు వెల్లడైంది. అమెరికా ప్రభుత్వ సాయంతో పనిచేసే 'ఫ్రీడమ్ హౌస్' సంస్థ భారత్‌ను 'పాక్షిక స్వేచ్ఛలు' కలిగిన దేశంగా అంచనా వేసింది. స్వీడన్‌కి చెందిన వి-డెమ్ ఇనిస్టిట్యూట్ అయితే భారత్‌ను 'ఎన్నికైన నియంతృత్వం'గా బహిరంగంగానే వ్యాఖ్యానించింది. భారత్, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా గల పేరు ప్రతిష్టలను పోగొట్టుకుందని ఆరోపణలు వస్తుండడంతో స్పందించిన కేంద్ర మంత్రులు ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదని పేర్కొన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక హోదాను రద్దు చేయడం, ముస్లింలకు మినహా మిగిలిన శరణార్థులకు పౌరసత్వాన్ని మంజూరు చేసేందుకు చట్టాన్ని చేయడం బహుశా ఇంతటి పేలవమైన ర్యాంక్ రావడానికి కారణమై వుంటాయని అధికారిక అంచనా.

ఎంపి కుటుంబం కిడ్నాప్‌పై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ

(మొదటి పేజీ తరువాయి)

విస్తరించడంలో అడ్డూఅదుపూ లేకుండా పోయింది. ఇటీవల కాలంలో సిరిపురం జంక్షన్‌లోని తన బిల్డింగ్ నిర్మాణానికి రాతిని పేల్చడానికి కార్పొరేషన్ పర్మిషన్ ఇవ్వలేదు. దీంతో, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతానని బెదిరింపులకు పూనుకుంటున్నారని తెలుస్తోంది. హయగ్రీవా ప్రాజెక్టును జగదీశ్వరుడు వద్ద నుంచి విశాఖ ఎంపి, ఆడిటర్ జివి సొంతం చేసుకున్నారని వార్తలు వచ్చాయి. వీరిద్దరి, అలాగే ఎంపి మొత్తం వ్యాపార సామ్రాజ్యంపై విచారణ జరిపించాలి. ఈ నేపథ్యంలో సిఎం వెంటనే జోక్యం చేసుకొని ప్రజల్లో ఉన్న వివిధ అంశాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజల ముందుంచాలి. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఈ సంఘటనను చిన్న విషయంగా చూస్తున్నారు. వాస్తవాలు బహిరంగ పర్చకుండా రహస్యంగా ఉంచుతున్నారనే అభిప్రాయం బలంగా ఉంది. ఇటీవల కాలంలో రౌడీ షీటర్ల మధ్య హత్యలు పెరిగాయి. దీని వెనుక రియల్ ఎస్టేట్ దందా ఉందని ప్రజలు భావిస్తున్నారన్నారు. ఈ అన్ని అంశాలూ నిగ్గు తేలాలంటే సమగ్ర విచారణ జరగాలి' అని ఈ లేఖలో పేర్కొన్నారు.

ఈజిప్ట్ చేరుకున్న ప్రధాని మోడీ


కైరోలో విమానం దిగుతూ అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

కైరో, వాషింగ్టన్ : అమెరికాలో నాలుగు రోజులు పర్యటన ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోడీ ఈజిప్ట్‌లో రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం కైరో చేరుకున్నారు. ఈజిప్ట్ ప్రధాని ముస్తఫా మద్బులీ విమానాశ్రయంలో మోడీకి స్వాగతం పలికారు. అనంతరం సైనిక గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆదివారం ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫతా ఎల్ సిసితో మోడీ భేటీ అవుతారు. ఇతర నేతలు, ప్రముఖులతో కూడా మోడీ చర్చలు జరుపుతారు. ఈజిప్ట్‌లోని భారతీయులను కూడా కలుసుకుంటారని విదేశాంగ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాచీన వాణిజ్యం, ఆర్థిక సంబంధాలు, సాంస్కృతిక, ప్రజా సంబంధాల ప్రాతిపదికన ఇరుదేశాల సంబంధాలు అభివృద్ధి చెందుతున్నాయని ఆ ప్రకటన పేర్కొంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమవుతాయని భావిస్తున్నారు.

ఈజిప్ట్‌తో భారత్‌కు గల బహుముఖ సంబంధాలు ఈ ఏడాది వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి చేరాయని ఈజిప్ట్‌లో భారత రాయబారి వ్యాఖ్యానించారు. మోడీ తాజా పర్యటనతో ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలోపేతమవుతాయని అన్నారు. ఈజిప్ట్‌లో మోడీ మొదటి అధికారి పర్యటన ఇది. 26 ఏళ్ల తర్వాత భారత ప్రధాని ఈజిప్ట్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఆఫ్రికా ఖండంలో కీలకమైన వాణిజ్య భాగస్వాముల్లో ఒకటైన ఈజిప్ట్‌లో మోడీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఏడాది భారత రిపబ్లిక్ దినోత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈజిప్ట్ అధ్యక్షుడు అబ్దుల్ ఫత్తా ఎల్ సిసి ఆహ్వానం మేరకు మోడీ పర్యటిస్తున్నారు. ఈ పర్యటనా సమయంలో మోడీ హెలిపోలిస్ వార్ గ్రేవ్ సిమెట్రీని సందర్శిస్తారు. మొదటి ప్రపంచ యుద్ధంలో ఈజిప్ట్ కోసం పోరాడి అశువులు బాసిన భారత సైనికులకు నివాళులర్పిస్తారు. దావూదీ బోరా కమ్యూనిటీ సాయంతో పునరుద్ధరణ పనులు చేపట్టిన 11వ శతాబ్దం నాటి అల్‌హకీమ్ మసీదును ఆదివారం మోడీ సందర్శిస్తారు. సెప్టెంబరులో జరిగే జి-20 సదస్సుకు హాజరయ్యేందుకు ఈజిప్ట్ అధ్యక్షుడు ఎల్ సిసి భారత్ రానున్నారు. ఈ సదస్సుకు ప్రత్యేక అతిథిగా ఈజిప్ట్‌ను ఆహ్వానించారు.

భారతీయుల ప్రతిభ, అమెరికా సాంకేతికత కలిస్తే గొప్ప భవిష్యత్

భారతీయుల ప్రతిభను, అమెరికా అత్యున్నత సాంకేతికతలను ఒక చోటకు తీసుకువస్తే అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని, మెరుగైన భవిష్యత్ మన స్వంతమవుతుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో ఇరు దేశాలకు చెందిన వ్యాపార, వాణిజ్య దిగ్గజాలతో జరిగిన భేటీలో ఆయన మాట్లాడారు. భారతదేశ ఆకాంక్షలు, అవకాశాలను, అధ్యక్షుడు బైడెన్ దార్శనికతను మరింత ముందుకు తీసుకెళ్లడానికి ఇదొక గొప్ప అవకాశమని మోడీ పేర్కొన్నారు. మైక్రోసాఫ్ట్ సిఇఓ సత్య నాదెళ్ల, ఆపిల్ సిఇఓ టిమ్ కుక్, గూగుల్ సిఇఓ సుందర్ పిచాయ్, ఓపెన్ ఎఐ సిఇఓ శామ్ అల్తమన్, ఎఎండి సిఇఓ లిసా సూ, నాసా వ్యోమగామి సునీతా విలియమ్స్ ప్రభృతులు అమెరికన్ ప్రతినిధులుగా పాల్గొనగా, ముకేష్ అంబానీ, ఆనంద్ మహీంద్రాలతో సహా పలువురు ప్రముఖులు భారత ప్రతినిధులుగా హాజరయ్యారు.

బీరేన్‌సింగ్ సిఎంగా అనర్హుడు

(మొదటి పేజీ తరువాయి)

జరిగిందని పేర్కొన్నారు. మణిపూర్ ఐక్యత, ప్రాదేశిక సమగ్రతపై ఏ విధంగానూ రాజీపడవద్దని స్పష్టం చేశారు. ప్రతి సంఘం ఫిర్యాదులను తప్పనిసరిగా వినాలని, సున్నితంగా పరిష్కరించాలని సూచించారు. రెండు జాతీయ రహదారులను ఎల్లప్పుడూ తెరిచి, సురక్షితంగా ఉంచాలని, ప్రజలకు అవసరమైన వస్తువులు లభ్యమయ్యేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత ప్రజలకు ఉపశమనం, పునరావాసం, జీవనోపాధికి సంబంధించిన ప్యాకేజీని తక్షణం సిద్ధం చేయాలని, ఇప్పటికే ప్రకటించిన ఉపశమన ప్యాకేజీ సరిపోదని అన్నారు.

బీరెన్ సింగ్‌కు అధికారంలో కొనసాగే హక్కు లేదు: సిపిఎం

పక్షపాతం, నిష్క్రియాత్మకమైన బిజెపి ముఖ్యమంత్రి బీరెన్ సింగ్‌కు అధికారంలో కొనసాగే హక్కు లేదని సిపిఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్ అన్నారు. సమస్యలకు బీరెన్ సింగ్ మూలకారణమని, ఆయన సిఎంగా కొనసాగితే పరిష్కారం అసాధ్యమని అన్నారు. బిజెపి మిత్రపక్షమైన ఎంఎన్ఎఫ్‌తోపాటు సమాజ్‌వాదీ పార్టీ, జెడియు, ఆప్, ఆర్‌జెడి కూడా సిఎంను తొలగించాలన్న సిపిఎం డిమాండ్‌కు మద్దతు పలికాయి. పోలీసుల ఆయుధాలను మిలిటెంట్లు స్వాధీనం చేసుకోవడంపై కేంద్రం మౌనం వహించడాన్ని బ్రిట్టాస్ ప్రశ్నించారు. ఇద్దరు బిజెపి ఎమ్మెల్యేలుసహా ముగ్గురితో కూడిన ప్రతినిధి బృందం ఢిల్లీ చేరుకుని ప్రధానిని కలిసేందుకు సమయం అడిగినా ఇవ్వలేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని మార్చాలని బిజెపి ఎమ్మెల్యేలు స్వయంగా డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. మేఘాలయ, సిక్కిం ముఖ్యమంత్రులను సమావేశానికి ఆహ్వానించి, మణిపూర్ ముఖ్యమంత్రిని ఆహ్వానించకపోవడంపై బ్రిట్టాస్ ప్రశ్నించారు.

అఖిలపక్షాన్ని మణిపూర్ పంపండి : ఆర్‌జెడి, టిఎంసి

వారం రోజుల్లో అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని మణిపూర్ పంపించాలని టిఎంసి, ఆర్‌జెడి డిమాండ్ చేశాయి. శాంతి, సామరస్యాన్ని పునరుద్ధరించాలని కోరాయి. మణిపూర్ సిఎంపై విశ్వాసం లేదని, ఆయన శాంతిని పునరుద్ధరించలేరని చెప్పినట్లు ఆర్‌జెడి నేత మనోజ్ కుమార్ ఝా అన్నారు.

శివసేన (ఉద్ధవ్ థాకరే) ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ మణిపూర్ పరిస్థితిపై అన్ని పార్టీలు ఆందోళన వ్యక్తం చేశాయని, సాధారణ స్థితికి తీసుకురావడానికి తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరామని చెప్పారు.

డిఎంకె నేత తిరుచ్చి శివ మాట్లాడుతూ "శాంతిని పునరుద్ధరిస్తామని, తనను నమ్మాలని హోం మంత్రి అన్నారు. ప్రధాని స్పందించకపోవడంపై నిలదీశాం. అఖిలపక్ష ప్రతినిధి బృందాన్ని మణిపూర్ పంపాల్సిందిగా కోరాం. పాలనా వైఫల్యం, కేంద్ర ప్రభుత్వ వైఫల్యం వల్లే అక్కడ హింస చెలరేగింది" అని అన్నారు.

బిఆర్ఎస్ నేత బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ మణిపూర్ ప్రజలకు భరోసా, ధైర్యం కల్పించే బాధ్యత అన్ని రాజకీయ పార్టీలపై ఉందని అఖిలపక్ష సమావేశంలో చెప్పామన్నారు. బాధితులకు పునరావాసం కల్పించాలని, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించాలని కోరామన్నారు. ఇప్పటివరకు ప్రధాని స్పందించకపోవడం మంచి పద్ధతి కాదని అన్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు అన్ని పార్టీలను తీసుకెళ్లాలని కోరారు.

ఈ సమావేశానికి జెపి నడ్డా (బిజెపి), మేఘాలయ సిఎం కాన్రాడ్ సంగ్మా (ఎన్‌పిపి), సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ (సిక్కిం క్రాంతికారి మోర్చా), , బీరేంద్ర ప్రసాద్ బైశ్యా (అసోం గణ పరిషత్), డెరెక్ ఒబ్రెయిన్ (టిఎంసి),

రామ్ గోపాల్ యాదవ్ (ఎస్‌పి), బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి (వైసిపి), వినోద్ కుమార్ (బిఆర్ఎస్), సంజయ్ సింగ్ (ఆప్), పినాకి మిశ్రా (బిజెడి), తంబిదురై (అన్నాడిఎంకె), నరేంద్ర వర్మ (ఎన్‌సిపి), అనిల్ ప్రసాద్ (జెడియు), పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర హోం సహాయ మంత్రులు నిత్యానంద్ రాయ్, అజయ్ కుమార్ మిశ్రా, కార్యదర్శి అజయ్ భల్లా, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్ తపన్ దేకా తదితరులు హాజరయ్యారు.

అఖిలపక్ష సమావేశానికి సిపిఐని ఆహ్వానించకపోవడంపై కేంద్ర హోం మంత్రి వివరణ ఇవ్వాలని ఆ పార్టీ ఎంపి బినయ్ విశ్వం డిమాండ్ చేశారు. అఖిలపక్షం నేపథ్యంలో ఆయన ఈమేరకు స్పందించారు.

రష్యాలో వాగ్నర్ గ్రూపు విద్రోహం

(మొదటి పేజీ తరువాయి)

ఇదమిత్థంగా తెలియరాలేదు. వాగ్నర్ గ్రూపు అధిపతి ప్రిగొజిన్ చర్యను రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ తీవ్రంగా పరిగణించారు. శుక్రవారం రాత్రి ఆయన జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రైవేట్ మిలిటరీ కంపెనీ (పిఎంసి) వాగ్నర్ చర్యను 'వెన్నుపోటు', 'ద్రోహం' గా అభివర్ణించారు. తిరుగుబాటు యత్నాన్ని చెచెన్, కజకిస్తాన్, బెలారస్ తదితర రిపబ్లిక్కుల నేతలు తీవ్రంగా ఖండించారు.రష్యాకు తమ పూర్తి మద్దతు ప్రకటించారు. ఉక్రెయిన్, బ్రిటన్ నేతలు రొస్తావ్ అన్ డాన్‌లో పరిణామాలను గమనిస్తున్నామని అన్నారు. అవసరమైతే సంకీర్ణ భాగస్వాములతో దీనిపై చర్చిస్తామని బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ బిబిసికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

ప్రైవేట్ మిలిటరీ గ్రూపు వాగ్నర్ తిరుగుబాటు యత్నం నేపథ్యంలో మాస్కో సిటీ, మాస్కో రీజియన్, వొరొనెజ్ రీజియన్లలో కౌంటర్ టెర్రరిస్టు రిస్క్ ఆపరేషన్‌ను చేపట్టాలని రష్యన్ నేషనల్ యాంటీ టెర్రరిస్టు కమిటీ శనివారం ఆదేశించింది. వాగ్నర్ గ్రూపు దళాలు ఇంకెంత మాత్రం జాప్యం లేకుండా రష్యన్ సైన్యానికి లొంగిపోవాలని, అలా లొంగిపోయిన ప్రతి ఒక్కరి రక్షణకు గ్యారంటీ ఇస్తామని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. చెచెన్యా రిపబ్లిక్ అధ్యక్షుడు రంజాన్ కద్రిరోవ్ శనివారం టెలిగ్రామ్‌లో ఒక పోస్ట్ పెడుతూ, ఉద్రిక్తత నెలకొన్న రొస్తావ్ అన్‌డాన్ ప్రాంతం దిశగా రష్యన్ నేషనల్ డిఫెన్స్, చెచెన్ రిపబ్లిక్ నేషనల్ కోస్ట్ గార్డు దళాలు దూసుకెళ్తున్నాయని తెలిపారు.

అంతర్గత విభేదాలు పక్కన పెట్టి
బాహ్య శత్రువుపై ఐక్యంగా పోరాడుదాం: పుతిన్

రష్యా భవిష్యత్తు కోసం నియోనాజీలు, వారి యజమానులతో భీకర పోరు సాగిస్తున్న సమయంలో వాగ్నర్ గ్రూపు తిరుగుబాటుకు యత్నించడం ఈ పోరాటానికి వెన్నుపోటు పొడవడమేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ పేర్కొన్నారు. పశ్చిమ దేశాలు మిలిటరీ, ఆర్థిక, సమాచార యంత్రాన్ని మొత్తం శక్తిని రష్యాకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టిన ఈ తరుణంలో జాతీయ ఐక్యత చాలా ముఖ్యమని అన్నారు. శుక్రవారం రాత్రి ఆయన జాతినుద్దేశించి ప్రసంగిస్తూ , రష్యన్ల మధ్య చీలిక తెచ్చే శత్రువుల ఎత్తులను చిత్తు చేయాలన్నారు. మొదటి ప్రపంచ యుద్ధం మధ్యలో అంటే 1917లో ఇదే విధమైన దృష్టాంతం చోటుచేసుకుందని పుతిన్ గుర్తు చేశారు. కుతంత్రాలు, గొడవలు, వెన్నుపోటు రాజకీయాలు ఎలా పతనానికి దారి తీశాయో వివవరించారు. రష్యన్లు రష్యన్లనే చంపుతున్నారని, భ్రాతృ హత్యలకు పాల్పడుతున్నారని విదేశీ శక్తులు మనపై విష ప్రచారం చేసేందుకు అవకాశమివ్వరాదని అన్నారు. కొంత మంది వ్యక్తులు తమ వ్యక్తిగత ఆశలు, ఆసక్తుల కోసం దేశానికి, దేశ ప్రజలకు ద్రోహం తలపెడుతున్నారని ప్రిగోజిన్‌నుద్దేశించి అన్యాపదేశంగా ఆయన పేర్కొన్నారు. అంతర్గత తిరుగుబాటు రష్యా ప్రజలకు, దేశానికి ప్రమాదకరమని అన్నారు.తిరుగుబాటుకు యత్నించిన వాగ్నర్ గ్రూపు బాస్ పై క్రిమినల్ విచారణ చేపట్టాలని ఆదేశించినట్లు పుతిన్ తెలిపారు. మాస్కోలోను, ఇతర ప్రాంతాల్లోను ప్రత్యేక యాంటీ టెర్రరిస్టు ప్రోటోకాల్ అమలు చేయనున్నామన్నారు. ప్రసంగం ముగింపులో దేశాన్ని రక్షించేందుకు, రాజ్యాంగ క్రమాన్ని , జీవన భద్రతను, పౌరుల స్వేచ్ఛను కాపాడేందుకు తాను చేయగలిగిందంతా చేస్తానని పుతిన్ హామీ ఇచ్చారు.

గ్రేటర్ నోయిడా అథారిటీపై రైతుల ఘనవిజయం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

గ్రేటర్ నోయిడా అథారిటీపై రైతుల ఉద్యమం ఘనవిజయం సాధించింది. ఎట్టకేలకు అధికార యంత్రాంగం దిగొచ్చింది. 60 రోజులుగా ఎఐకెఎస్ ఆధ్వర్యాన రైతులు తమ డిమాండ్ల సాధన కోసం గ్రేటర్ నోయిడా అథారిటీ కార్యాలయం ప్రధాన గేటు వద్ద ఆందోళన చేస్తున్నారు. రైతులపై పోలీసుల అణచివేత ప్రదర్శించారు. 35 మంది రైతు నాయకులను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. గ్రేటర్ నోయిడా డెవలప్‌మెంట్ అథారిటీ, అలాగే బిజెపి ప్రభుత్వం రైతులతో ఒక ఒప్పందానికి రావాల్సి వచ్చింది. ఇది స్ఫూర్తిదాయక విజయమని ఎఐకెఎస్ పేర్కొంది. పోరాడిన వారందరికీ, ముఖ్యంగా పెద్ద సంఖ్యలో మహిళలకు ఎఐకెఎస్ అభినందనలు తెలిపింది. అరెస్టు చేసిన వారందరినీ విడుదల చేయడంతో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు అంగీకరించింది. అన్ని సమస్యలపై చర్చకు అంగీకరించిన ప్రభుత్వం జూన్ 30న చర్చించి తుది నిర్ణయం తీసుకునేందుకు కమిటీని ఏర్పాటు చేసింది.

మండలం యూనిట్‌గా ఆర్‌ఆర్

(మొదటి పేజీ తరువాయి)

విశాఖపట్నం మారిందని, విశాఖ ఎంపి ఎంవివి.సత్యనారాయణ కుటుంబం కిడ్నాప్ ఉదంతమే దీనికి నిదర్శనమని అన్నారు. విశాఖలో జరుగుతున్న దందాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి ప్రజలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ వర్షాలు ప్రారంభమయ్యాయని, పోలవరం నిర్వాసితుల్లో ముంపు భయం వెంటాడుతోందని తెలిపారు. గతేడాది వరదలో రాష్ట్ర ప్రభుత్వం నామమాత్రపు సహాయం చేసి చేతులు దులుపుకుందని విమర్శించారు. సమావేశంలో పార్టీ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అసోంలో వరదలు

- పలువురు మృతి

గువహతి : అసోంలో కురిసిన కుండపోత వర్షాలకు రోడ్లు ఏరుల్ని తలపిస్తున్నాయి. నదులు ప్రమాదస్థాయికి మించి ప్రవహించడంతో వేలాది గ్రామాలు వరద నీటిలో మునిగిపోయాయి. ఇక లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులై కొండలు, గుట్టల మీద తలదాచుకుంటున్నారు. ప్రస్తుతం 19 జిల్లాలు వరద ప్రభావిత జిల్లాలుగా ఉన్నాయని అస్సాం స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎస్‌డిఎంఎ) శనివారం వెల్లడించింది. ప్రస్తుతం అసోం ఇంకా దయనీయ పరిస్థితుల్లోనే ఉందని ఎస్‌డీఎంఎ పేర్కొంది. ఈ వరదల కారణంగా గురువారం తాముల్పూర్ జిల్లాలో వరద ప్రభావానికి ఒకరు మరణించారు. శుక్రవారం నల్బరీ జిల్లాలోని నిఖిలేష్ మల్లా బుజోర్‌బరువా అనే వ్యక్తి తన ఇంటి దగ్గర ఉన్న వరద నీటిలో ప్రమాదవశాత్తూ పడిపోయి మరణించాడు. వరద ప్రభావితమైన జిల్లాలుగా బజలి, చిరాంగ్, దర్రాంగ్, బక్సా, బర్పేట, బిస్వనాథ్, బొంగైగావ్, ధేమాజీ, ధుబ్రి, డీబ్రూగర్, గోల్‌పరా, గోలాఘాట్, కమ్రూప్, కోక్రార్ఝర్, లఖింపూర్, నాగోన్, నల్బరీ, తమూల్‌పూర్, ఉదల్‌గురిలు ఉన్నాయని ఎస్‌డిఎంఎ పేర్కొంది. బజలి జిల్లా పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. ఈ జిల్లాలో 267,253 మంది వరద నీటిలో ఇళ్లు మునిగిపోయి నిరాశ్రయులయ్యారు. 73,233 మంది నిరాశ్రయులై ఆ తర్వాత రెండో స్థానంలో బార్పేట జిల్లా నిలిచింది. 14 జిల్లాలో రాష్ట్ర యంత్రాంగం నిర్వహిస్తున్న 225 సహాయక శిబిరాల్లో కనీసం 35,142 మంది తలదాచుకున్నారు.

భారత్‌లో మెరుగైన సాంకేతిక విద్యకు 25.55 కోట్ల ప్రపంచ బ్యాంక్ రుణం

న్యూఢిల్లీ : భారతదేశంలో ప్రభుత్వ విద్యా సంస్థల్లో సాంకేతిక విద్య నాణ్యతను మెరుగుపరిచేందుకు 25.55 కోట్ల డాలర్ల రుణాన్ని ప్రపంచ బ్యాంక్ ఆమోదించింది. రాబోయే ఐదేళ్లలో, దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన రాష్ట్రాల్లో దాదాపు 275 ప్రభుత్వ సాంకేతిక విద్యా సంస్థలకు ఈ ప్రాజెక్టు కింద సాయం అందుతుంది. ప్రతి ఏటా మూడున్నర లక్షలమంది విద్యార్థులు లబ్ది పొందుతారు. పరిశోధన, కొత్త ఆవిష్కరణలపై దృష్టి పెట్టడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడేలా నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఈ మొత్తాలను ఉపయోగిస్తారు. సాంకేతిక విద్యా సంస్థల్లో పాలనను మెరుగుపరిచేందుకు ఉపయోగిస్తారు. కొత్తగా ఉద్యోగ రంగంలో, వ్యాపార రంగాల్లో తలెత్తే అవకాశాలను ఉపయోగించుకునేలా విద్యార్థులను మరింత మెరుగ్గా సన్నద్ధం చేయడానికి కీలకమైన సాంకేతిక రంగాన్ని ఆధునీకరించాలని భారతప్రభుత్వం భావించింది. సాంకేతిక విద్యా సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని మెరుగుపరచడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టనున్నారు.





మీకోసం

చెప్పులు, బూట్లు కరుస్తుంటే ఆ భాగానికి పెరుగు రాసి రాత్రంతా ఉంచి తెల్లారి ఎండిన పెరుగును దులిపి పాద రక్షలు ధరించాలి.

జీవనసౌరభం

పనిచేసిన ప్రతిసారీ సత్ఫలితాలు రాకపోవచ్చు గాని, అసలు ప్రయత్నమే చేయకపోతే ఏ ఫలితమూ రాదు.

JEEVANA జీవన the family

నూకరాజు - సోమరాజు



గొర్రిపూడిలో తొమ్మిదో తరగతి చదువుతున్న సోమరాజు, ఎనిమిదో తరగతి చదువుతున్న నూకరాజు కాకినాడ పట్నం వెళ్లారు. ఆ రోజు అన్ని వీధులు తిరిగినప్పటికీ, ఏ బుక్ షాపుల్లోనూ సోమరాజుకు కావలసిన భూగోళ శాస్త్రం వాచకం దొరకలేదు.

'అయ్యో ఆ వాచకం ఇప్పుడే అయిపోయింది! అది తర్వాత వస్తదమ్మా' అని చెప్పారు షాపుల వాళ్లు. నిరాశతో ఇద్దరూ ఇంటి దారి పట్టారు. కాళ్లు ఈడ్చుకుంటు గొర్రిపూడి చేరుకున్నారు. ఓ జామ చెట్టు దగ్గర జామకాయలు కోసుకొని తినసాగాడు నూకరాజు. 'నువ్వు కూడా తినరా అంటూ సోమరాజుకు ఓ జామకాయ ఇచ్చాడు.

'ఏం జాంకాయ తినడం రా. నాకు కావాల్సిన పుస్తకం దొరకలేదు. బడిలో మాస్టారుకు. ఇంట్లో అమ్మా నాన్నకు ఏం చెప్పాలి' అంటూ తల గోక్కోసాగాడు సోమరాజు.

'అవును రోయ్.. జామకాయ తింటుంటే నాకు ఆలోచన వచ్చింది, మా అన్నయ్య బడి మానేస్తాడంట మాస్టర్ గారి దెబ్బలు తట్టుకోలేకపోతున్నాడు అంట! మా అన్నయ్య తొమ్మిదో తరగతే కదా, ఆ వాచకం ఉంది. మా ఇంటికెళ్లి, అన్నయ్యను అడిగి నీకు ఆ పుస్తకం ఇస్తాను' అన్నాడు నూకరాజు.

'అయ్యో.. మీ అన్నయ్య బడి మానేస్తాడా? అయినా బడిలో పిల్లలను కొట్టకుండా ఉంటే బాగుండు.' అన్నాడు సోమరాజు.


'అవును బడిలోనూ పుస్తకాలు ఇస్తే బాగుండు, కొనుక్కుందామన్న పుస్తకాలు ఇప్పుడు దొరకడం లేదు' అన్నాడు నూక రాజు.

'అయితే మీ అన్నయ్య పుస్తకం కొనుక్కుంటాను రా' అన్నాడు సోమరాజు.

'కొనడం ఎందుకులే.. నీవు ఈ సంవత్సరం చదువుకున్నాక, నాకు ఇచ్చేయ్. వచ్చే సంవత్సరం నాకు ఉపయోగపడుతుంది కదా! మళ్లీ కొనాలన్నా ఆ పుస్తకం దొరుకుతుందో! లేదో?' అనుకుంటూ ఇంటికి చేరారు. ఇంటికెళ్లి వాళ్ళ అన్నయ్యను అడిగి ఆ పుస్తకం తెచ్చి ఇచ్చాడు నూకరాజు.

అలా సోమరాజు, నూకరాజులు పెరిగి, పెద్దయ్యాక సోమరాజు ఇస్రోలో ఇంజనీర్‌గా, నూకరాజు వ్యాపారవేత్తగా స్థిరపడ్డారు!. మేటి పౌరులుగా నిలిచారు.

- అమ్మిన వెంకట అమ్మిరాజు
94407 08656



అవి ఏవీ?

చిన్నారులూ, ఇక్కడ రెండు వరుసల్లో కప్పలు ఉన్నాయి. వీటిలో రెండు కప్పలు ఒకే విధంగా ఉన్నాయి. అవి ఏంటో కనిపెట్టండి.

జవాబు: 1-4

నేను గీసిన బొమ్మ



- ధరణికోట హర్షిత్,
6వ తరగతి,
జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూలు,
హైదరాబాద్,
తెలంగాణ.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ:
chinnaarips@gmail.com

అమ్మ కల నెరవేరింది..





తెలంగాణ, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వివిధ రకాల వినతి పత్రాలు పట్టుకున్న గ్రామీణులు గుంపులుగా వేచి ఉన్నారు. ఆ గుంపులో ఓ యువకుడు చేతిలో రెండు పత్రాలు ఉన్నాయి. అందులో ఒకటి రాష్ట్ర యూనివర్శిటీ నుండి, మరొకటి ఐఐటి నుండి ఆఫర్ లెటర్. మద్రాస్ ఐఐటిలో చేరేందుకు రూ.20 వేల ఆర్థిక సాయం కోరేందుకు ఆ యువకుడు అక్కడ వేచివున్నాడు. అలా కలెక్టరు, కొంతమంది దాతలు చేసిన ఆర్థికసాయంతో కాలేజీలో సీటు సంపాదించాడు. అతని పేరు డోంగ్రే రేవయ్య. 2022 యుపిఎస్‌సి పరీక్షల్లో 410వ ర్యాంకు సాధించిన అతను స్ఫూర్తివంత ప్రయాణం గురించి మరికొంత తెలుసుకుందాం.

తెలంగాణ తుంగ్డ గ్రామంలో పుట్టిన రేవయ్యకు నాలుగేళ్లప్పుడు అతని తండ్రి చనిపోయాడు. ముగ్గురు బిడ్డలున్న ఆ కుటుంబానికి తల్లే పెద్ద దిక్కైంది. బిడ్డల పోషణ కోసం మధ్యాహ్న భోజన కార్మికురాలిగా పనిచేసింది. రూ.1500 జీతంతో కుటుంబానికి సాకుతున్న ఆ తల్లికి కొడుకు రేవయ్యకు ఐఐటిలో సీటు కోసం తన జీతానికి 14 రెట్లు ఖర్చు చేయాల్సిరావడం కలలో కూడా ఊహించి ఉండదు. అందుకే రేవయ్య దాతల కోసం అర్థించారు.

ప్రభుత్వ బడిలో చదువుకున్న రేవయ్య చదువులో ఎప్పుడూ చురుకుగా ఉండేవారు. 2017లో మద్రాసు ఐఐటిలో కెమికల్ ఇంజినీరింగ్ కోర్సు చేశారు. 'గేట్' పరీక్షలో మంచి ర్యాంకు సాధించి ఓఎన్‌జిసిలో ఉద్యోగం సంపాదించారు. కుటుంబానికి సాయంగా ఉద్యోగం చేస్తున్నా ఐఎఎస్ కావాలన్న అతని కల అలాగే ఉండిపోయింది. కల సాకారం కోసం చేస్తున్న ఉద్యోగానికి స్వస్తి చెప్పి 2020 నుండి యుపిఎస్‌సి పరీక్షలకు సిద్ధమయ్యారు.

2021లో లక్ష్యం చివరి వరకు వెళ్లి వెనుదిరిగినా నిరాశపడకుండా మళ్లీ ప్రయత్నం చేశారు. ఈసారి మంచి ర్యాంకుతో సివిల్స్ సాధించారు. ర్యాంకు సాధించిన రేవయ్య 'అమ్మ చదువుకోలేదు. స్కూలు గుమ్మం ఎక్కలేదు. మమ్మల్ని సాకేందుకు ఎన్నో కష్టాలు పడింది. ఇన్ని కష్టాలు పడుతున్నా నేను ఐఎఎస్ కావాలని కోరుకునేది. ఇప్పుడు ర్యాంకు రావడంతో నా కలతో పాటు అమ్మ కల కూడా నెరవేరిందని చాలా సంతోషపడుతున్నాను' అంటున్నారు. 'నేను ఐఐటీ జెఇఇలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ డబ్బు లేకపోవడంతో అక్కడ చదవగలననే ఆశను కోల్పోయాను. కానీ అప్పటి కలెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్ నాకు చాలా సాయం చేశారు. ఆ రోజే నేను ఒక నిశ్చయానికి వచ్చాను. నేను కూడా ఆ స్థానంలో ఉంటే నాలాంటి పేద విద్యార్థులకు సాయం చేయగలను అనుకొని పట్టుదలతో ఈ స్థాయికి వచ్చాను' అంటున్నారు. రేవయ్య. ఆయన మాటలు వింటుంటే మారుమూల గ్రామాల్లో విద్యార్థుల భవిష్యత్తుకు ఏ చిన్న సాయమందించినా వారు అపురూప విజయాలు సాధిస్తారని అర్థమవుతోంది.

కాచి చల్లార్చిన నీరు చేసే మేలు



వారం రోజుల నుంచి వర్షాలు పడుతున్నాయి. ఎండా కాస్తుంది. ఇటువంటప్పుడు శరీరానికి గోరు వెచ్చని నీళ్లు సహాయపడతాయి. పోషకాహారం ఎంత ముఖ్యమో నీళ్లు అంతే అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. తాగే నీళ్ల వేడిచేయడం వల్ల కంటికి కనిపించని క్రిములు, కీటకాలు కూడా నశించిపోతాయి. దాంతో జలుబు, దగ్గు, జ్వరాలు రావు.

- చల్లని వాతావరణం ఉన్నప్పుడు గోరువెచ్చటి నీళ్లు తాగితే శరీరంలో వేడి ఉత్పత్తి అయ్యి బద్ధకం తగ్గి యాక్టివ్‌గా మారుతుంది. చలి, వణుకు లాంటి లక్షణాలు ఏమైనా ఉంటే ఇట్టే తగ్గిపోతాయి.
- అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారు రోజు వేడి నీరు తాగితే శరీరంలో పేరుకుపోయిన కొవ్వు కరిగి బరువు తగ్గుతారు.
- ఆడవాళ్లకు నెలసరిలో వచ్చే అనేక సమస్యలు గోరువెచ్చటి నీళ్లతో పరిష్కారమవుతాయి. ఆ సమయంలో కలిగే విసుగూ అలసటా తగ్గుతాయి. పీరియడ్స్ టైమ్‌లో వచ్చే కడుపు నొప్పి నుంచి కొంత ఉపశమనం లభిస్తుంది. మొటిమలు రావు. చుండ్రు రాదు. జుట్టు రాలదు, కుదుళ్లు బలపడతాయి.
- వేడి నీళ్లతో అవయవాలన్నీ ఉత్తేజితమవుతాయి. జీర్ణప్రక్రియను వృద్ధిచేసి మలబద్ధక సమస్యను నివారిస్తాయి. కడుపు నొప్పి, అజీర్తి జీర్ణ సమస్యలు తగ్గుతాయి.
- వేడినీళ్లు తాగితే.. నరాల పనితీరు మెరుగుపడుతుంది. రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది. శరీరంలో మలినాలన్నీ వెళ్లిపోతాయి.
- చల్లటి నీళ్లు తాగడం వల్ల పంటి సెన్సిటివిటీ పెరిగిపోతుంది. అదే వేడి నీళ్లు తాగితే క్రిములు చచ్చిపోయి దంత సమస్యలు తగ్గుతాయి.
- కీళ్ల నొప్పులతో బాధపడేవారు వేడి నీళ్లు తాగితే, ఆర్థరైటీస్ సమస్యలు తగ్గుతాయి. శరీరం పొడిబారదు. ముఖం కాంతిమంతంగా ఉంటుంది.



ఆషాడం గోరింట.. ఆరోగ్య పంట ...

ఆషాడం వచ్చిందంటే వానలతో పాటు గోరింటాకు కూడా గుర్తొస్తుంది. నగరాల మాట అలా వుంచితే పొలం పనులు చేసుకునేవారు ఈ మాసంలో తప్పకుండా గోరింటాకు పెట్టుకుంటారు. చిన్నా, పెద్ద తేడా లేకుండా ఎంతో ఇష్టంగా పెట్టుకునే ఈ గోరింటాకు అందంతో పాటు ఆరోగ్యానికి కూడా పెద్ద పీట వేస్తుంది.

- ఈ కాలంలో తరచూ వచ్చే చర్మవ్యాధులు రాకుండా, గోళ్లు దెబ్బతినకుండా గోరింటాకు బాగా ఉపయోగపడుతుంది.
- వేసవి వేడి నుండి వర్షాకాలం ప్రారంభమైన ఈ వాతావరణంలో అకస్మాత్తుగా వచ్చిన మార్పు వల్ల శరీరంలో 'కఫ' సంబంధమైన దోషాలు ఏర్పడతాయి. ఈ సమస్యల నుండి ఉపశమనం పొందేందుకు గోరింటాకు చాలా బాగా పనిచేస్తుంది.
- గోరింట పెట్టుకోవడం వల్ల కంటికి అందంగానే కాకుండా గోళ్లు పెళుసు బారి పోకుండా, గోరుచుట్టు వంటి వ్యాధులు రాకుండా కాపాడుతుంది.
- గోరింట ఆకులే కాదు... పూలు, వేళ్ళ, బెరడు, విత్తనాలు... అన్నీ ఔషధాలుగా పనిచేస్తాయని ఆయుర్వేద శాస్త్రం చెబుతోంది.
- గోరింటలో ఉండే లాసోన్ అనే సహజమైన రసాయనం వల్ల ఎరుపు రంగు ఏర్పడుతుంది. మార్కెట్లో దొరికే కృత్రిమ రసాయనాలతో తయారైన కోన్లను పెట్టుకోవడం వల్ల గోరింటాకు ప్రయోజనాలు లభించవు. కాబట్టి సహజంగా దొరికే గోరింటాకునే ఉపయోగించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.

'భోళా శంకర్' ఏకాగ్ని



మెగాస్టార్ చిరంజీవి హీరోగా, మెహర్ రమేష్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా 'భోళా శంకర్'. పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ఈ సినిమా టీజర్ విడుదల చేశారు. సిటీలో తప్పులు చేస్తున్న విలన్లను, రౌడీలను చితకొట్టే వ్యక్తిగా చూపించారు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా తమిళంలో సూపర్ హిట్టయిన వేదాళంకు రీమేక్‌గా తెరకెక్కుతుంది. సిస్టర్ సెంటిమెంట్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో చిరుకు చెల్లెలిగా కీర్తి సురేష్ నటిస్తుంది. తమన్నా హీరోయిన్‌గా కనిపించనుంది. మెహర్ రమేష్ దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ ఈ సినిమాతో మెగా ఫోన్ పట్టాడు. ఈ సినిమాను ఏకే ఎంటర్‌టైనమెంట్స్, క్రియేటీవ్ కమర్షియల్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.



మత్తు పదార్థాల జోలికి వద్దు

'యువత ప్రతి ఒక్కరూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి. విద్యార్థులకు ఎంతో అందమైన జీవితం ఉంది. దాన్ని పూర్తిగా ఆస్వాదించాలి. సరదాగా పార్టీలకు హాజరైనా డ్రగ్స్ జోలికి వెళ్లకండి. నార్కోటిక్స్ అలవాటు పడితే అదే డెత్ సెంటన్స్ అవుతుంది.' అని హీరో నిఖిల్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మాదకద్రవ్యాల నిరోధక విభాగం పోలీసులు ఏర్పాటు చేసిన పరివర్తన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పైవిధంగా మాట్లాడారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ప్రియదర్శి మాట్లాడుతూ 'డ్రగ్స్‌వల్ల కలిగే దుష్పరిణామాలు ఏంటి? దాని ప్రభావం ఎలా ఉంటుంది?' అన్న అంశాలపై అందరికీ అవగాహన రావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా విద్యార్థుల కోసం ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నార్కోటిక్స్ విభాగం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు.

త్వరలో 'బ్రో' టీజర్



సముద్రఖని దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'బ్రో'. పవన్‌కళ్యాణ్ మెయిన్‌లీడ్‌గా నటిస్తున్నాడు. ఇందులో సాయిధరమ్ తేజ్ మరో ప్రధాన హీరోగా నటిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. ఫాంటసీ కామెడీ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా జూలై 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ క్రమంలో ఈ సినిమా టీజర్ త్వరలో విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. నిమిషం నిడివితో ఈ టీజర్ ఉండనుంది. ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులలో బిజీగా ఉంది. తమిళంలో సూపర్ హిట్టయిన 'వినోదయ సిత్తం' రీమేక్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. తెలుగు నేటివిటీకి తగ్గట్లు త్రివిక్రమ్ పలు మార్పులు చేర్పులు చేశారు. థమన్ సంగీతం అందిస్తున్న సినిమాను పీపుల్ మీడియా సంస్థ నిర్మిస్తుంది.

25న ట్రైలర్ విడుదల



శ్రీ విష్ణు నటిస్తున్న చిత్రం 'సామజవరగమన'. రామ్ అబ్బరాజు డైరెక్ట్ చేస్తున్నారు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా విడుదలకు సిద్ధమైంది. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి చేతుల మీదగా ఈ నెల 25న ట్రైలర్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ మూవీలో బిగిల్ ఫేమ్ రెబా మోనికా జాన్ హీరోయిన్‌గా నటిస్తోంది. వెన్నెల కిశోర్, నరేశ్, శ్రీకాంత్ అయ్యంగార్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో కలిసి హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. కాగా ఈ మూవీని జూన్ 29న థియేటర్స్‌లో విడుదల చేయనున్నారు.



ఎపి రాజకీయాల 'వ్యూహం'

దర్శకుడు రామ్‌గోపాల వర్మ తీసిన కొత్త చిత్రం 'వ్యూహం'. సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ క్రమంలో మేకర్స్ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో ఏపీలో గతంలో జరిగిన రాజకీయ అంశాలు కీలకంగా ఉన్నాయి. రాజశేఖర్‌రెడ్డి హెలికాప్టర్ ప్రమాదం, మరణించిన తర్వాత ఏపీలో ఎటువంటి వాతావరణం అలముకుంది. రాష్ట్రంలో ఉన్న కీలకమైన రెండు పార్టీల మధ్య, కుటుంబసభ్యుల్లో సృష్టించిన అలజడి, జరిగిన వివాదాల నేపథ్యంలో సినిమా నడిపారు. వంగవీటి సినిమాను నిర్మించిన దాసరి కిరణ్ ఈ మూవీని నిర్మిస్తున్నాడు. ఈ ప్రాజెక్ట్ రెండు భాగాలుగా తెరకెక్కింది. అందులో వ్యూహం తొలి పార్టు కాగా, రెండోది శపథం. తొలి పార్టులో వైఎస్ఆర్ మరణం, తర్వాత ఏం జరిగిందని చూపించారు. రెండో పార్ట్‌లో జగన్ ఎలా సీఎం అయ్యాడు అనేది ఆర్జీవి చూపించబోతున్నాడు.

శాఫ్ ఛాంపియన్‌షిప్

సెమీస్‌కు ఛెత్రీ సేన

నేపాల్‌పై 2-0 గోల్స్‌తో నెగ్గిన భారత్



బెంగళూరు: శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ సెమీఫైనల్లోకి భారతజట్టు దూసుకెళ్లింది. శనివారం జరిగిన గ్రూప్-ఏ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ 2-0గోల్స్ తేడాతో నేపాల్‌ను చిత్తు చేసి వరుసగా రెండో విజయాన్ని సొంతం చేసుకుంది. శ్రీ కంఠీరవ స్టేడియంలో ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో ప్రథమార్థం ముగిసే సరికి ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో తొలి అర్ధభాగం ముగిసేసరికి ఇరుజట్లు 0-0తో సమంగా నిలిచాయి. తొలి అర్ధభాగంలో ఒకటి, రెండుసార్లు ఛెత్రీ సేనకు గోల్ చేసే అవకాశం లభించినా సద్వినియోగం చేసుకోలేక పోయింది. రెండోఅర్ధభాగం 61వ ని.లో ఛెత్రీ ఒక గోల్ కొట్టడంతో భారత్ 1-0 ఆధిక్యతను సాధిం చింది. ఆ తర్వాత 70వ ని.లో సోరెమ్ మహేష్ సింగ్ మరో గోల్ కొట్టాడు. దీంతో భారత్ 2-0 ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. భారత్‌కు నాలుగు కార్నర్‌లు లభించగా.. 63శాతం బంతి భారత ఆట గాళ్ల చేతుల్లోనే ఉంది. ఇదే గ్రూప్‌లో ఉన్న కువైట్ జట్టు పాకిస్తాన్‌పై విజయం సాధించి సెమీస్ బెర్త్ ఖాయం చేసుకున్నాయి. జట్టు కోచ్ ఇగోర్ స్టిమాక్‌పై ఒక మ్యాచ్ నిషేధం దృష్ట్యా బుర్లీ క్రొయాట్ ఆ బాధ్యతల్లో కొనసాగనున్నాడు. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 101వ, నేపాల్ 174వ స్థానాల్లో ఉన్నాయి. ఇక తొలి మ్యాచ్‌లో నేపాల్ 1-3గోల్స్ తేడాతో కువైట్ చేతిలో ఓటమిపాలుకాగా.. భారతజట్టు 4-0తో పాకిస్తాన్‌పై గెలిచిన ఉత్సాహంతో బరిలో దిగాయి. ఈ గెలుపుతో భారత్, కువైట్ 6పాయింట్ల తో తొలి రెండు స్థానాల్లో నిలిచి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సెమీస్‌కు చేరాయి. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్ పటిష్ట కువైట్‌తో తలపడనుంది.

తొలిసారి ఆసియా క్రీడల్లో
పురుషులు, మహిళల క్రికెట్ జట్లు



న్యూఢిల్లీ: చైనా వేదికగా ఈ ఏడాది జరగనున్న ఆసియా క్రీడల్లో భారత పురుష, మహిళల క్రికెట్ జట్లు బరిలోకి దిగనున్నాయి. ఆసియా క్రీడల్లో ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే క్రికెట్‌కు అవకాశం దక్కింది. 2010, 2014 ఆసియా క్రీడల్లో క్రికెట్‌ను భాగం చేసినా.. టీమిండియా పాల్గొనలేదు. బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, శ్రీలంక క్రికెట్ జట్లు పాల్గొన్నాయి. బిజీ షెడ్యూల్ కారణంగా ఆసియా క్రీడల్లో తమ జట్లు పాల్గొనలేవని అప్పట్లో తెలిపింది. ఈ ఏడాది కూడా ఆసియాకప్‌తో పాటు వన్డే ప్రపంచకప్ ఉన్న నేపథ్యంలో ఈ టోర్నీలో భాగం కాలేమని బిసిసిఐ ఇప్పటికే నిర్వాహకులకు చెప్పింది. తాజాగా ఆసియా క్రీడలకు ద్వితీయ శ్రేణి జట్టును పంపించాలని భావిస్తున్నట్లు బిసిసిఐ అధికారి ఒకరు తెలిపారు. మహిళల జట్టు కూడా ఈ టోర్నీలో పాల్గొననుంది. జూన్ 30లోపు భారత ఒలింపిక్ అసోసియేషన్‌కు బిసిసిఐ తమ ఆటగాళ్ల జాబితాను పంపనున్నట్లు పేర్కొంది. 'ఆసియా క్రీడల్లో టీమిండియా పురుషుల, మహిళల జట్టు పాల్గొనబోతుంది. వన్డే ప్రపంచకప్ నేపథ్యంలో ద్వితీయ శ్రేణి టీమ్‌ను బరిలోకి దించాలని నిర్ణయించాం. త్వరలోనే భారత ఒలింపిక్ సంఘానికి ఈ విషయాన్ని తెలియజేస్తాం' అని ఆ అధికారి తెలిపాడు. మరోవైపు ఏషియన్ గేమ్స్ మిషన్ చీఫ్ భూపెందర్ భజ్వా మాత్రం బిసిసిఐ నుంచి స్పష్టమైన సమాచారం రాలేదన్నారు. ఇక చైనాలోని గ్వాంఝు వేదికగా సెప్టెంబర్ 23 నుంచి ఆసియా క్రీడలు జరగనున్నాయి.

వెస్టిండీస్ వన్డే ప్రపంచకప్ ఆశలు ఆవిరి
జింబాబ్వే చేతిలో 35పరుగుల తేడాతో అనూహ్య ఓటమి



హరారే: రెండుసార్లు వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ వెస్టిండీస్ జట్టు ఈసారి ప్రధాన టోర్నీకి అర్హత సాధించడమే కష్టంగా మారింది. ప్రధాన టోర్నీకి అర్హత సాధించాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో జింబాబ్వే చేతిలో 35పరుగుల తేడాతో ఓటమిపాలైంది. దీంతో గ్రూప్-ఏ నుంచి జింబాబ్వే జట్టు ఐసిసి వన్డే ప్రపంచకప్ ప్రధాన టోర్నీకి అర్హత సాధించేందుకు అడుగు దూరంలో నిలిచింది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వే పసికూన అమెరికాపై గెలిస్తే నేరుగా ప్రధాన టోర్నీకి అర్హత సాధించనుంది. ఇక శనివారం జరిగిన గ్రూప్-ఏ లీగ్ మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 49.5ఓవర్లలో 268పరుగులకు కుప్పకూలింది. సికిందర్ రాజా(68), రియాన్ బర్ల్(50) అర్ధసెంచరీలకి తోడు కెప్టెన్ ఎర్విన్(47) బ్యాటింగ్‌లో రాణించారు. కీమో పాల్‌కు మూడు, హొసైన్, జోసెఫ్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో విండీస్ జట్టు 44.4 ఓవర్లలో 233పరుగులకే కుప్పకూలింది. మయర్స్(56), ఛేస్(44), పూరన్(34) బ్యాటింగ్‌లో రాణించారు. లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఘోరంగా నిరశపరిచారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సికిందర్ రాజాకు లభించింది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వేజట్టు అమెరికా చేతిలో ఓడి.. వెస్టిండీస్ జట్టు నెదర్లాండ్స్‌పై విజయం సాధిస్తే సమీకరణలు మారే అవకాశముంది.

నెదర్లాండ్స్ ఘన విజయం

గ్రూప్-ఏలో నెదర్లాండ్స్ జట్టు 7వికెట్ల తేడాతో నేపాల్‌పై ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ జట్టు 44.3ఓవర్లలో 167పరుగులకు ఆలౌటైంది. ఛేదనలో నెదర్లాండ్స్ జట్టు 27.1 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 168పరుగులు చేసి ఘన విజయం సాధించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68